# మెహెర్‌బాబా వార్షిక సభ్యత్వం

చాలామంది బాబా ప్రేమికులు తమ వార్షిక సభ్యత్వం బాకీలున్నారు. కొందరయితే, రెండు మూడేళ్ళనుంచి బకాయిపడ్డారు. ఈ ఏడాది నేటిదాకా సభ్యత్వం పంపినవారు కేవలం 300 మంది మాత్రమే. ఐనప్పటికీ ప్రతినెలా క్రమం తప్పక మెహెర్‌బాబా సంచికలు అందరికీ పోస్టులో పంపుతున్నాం. దయచేసి Subscription due వున్నవారు తమ సభ్యత్వం వెంటనే పంపి సహకరించవల్సిందిగా కోరుతున్నాం.

అలాగే, జీవిత సభ్యత్వం రెండు దఫాలు చెల్లించినవారు కూడా, మొదటి దఫా చెల్లించి కొన్నేళ్ళు పైబడినా వారి రెండవ విడత సభ్యత్వం నేటిదాకా పంపలేదు. దయచేసి తమ రెండవ విడత తక్షణం పంపవల్సిందిగా మనవి.

బాబా ప్రేమికులు తమ బంధు, మిత్రులందరిచేత మెహెర్‌బాబా సంచిక జీవిత సభ్యులుగా చేర్పించి పత్రిక పురోభివృద్ధికి సహకరించ ప్రార్థన.

# మెహెర్ హెల్త్ సెంటర్

మెహెరాబాద్‌లోని మెహెర్ హెల్త్ సెంటర్‌లో **దంత పరీక్షల నిర్వహణకోసం సుమారు రూ. 30 వేలు ఖర్చుకాగల దంతాలను ఎక్సరేతీసే యంత్రం కొనుగోలుకై** బాబా ప్రేమికులు తగిన సహాయం అందించాలని ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్, శ్రీ వై.స్.రావ్ గత నెల మెహెర్‌బాబా పత్రిక ద్వారా ఒక ప్రకటన చేసిన విషయం పాఠకులకు విదితమే.

ఇందుకు సంబందించి శ్రీ వై . అప్పారావ్, అనకాపల్లి, తక్షణం స్పందిస్తూ తగిన నగదు పంపినారని శ్రీ రావు ఒక లేఖలో తెలిపారు.

# పత్రిక సకాలంలో

మెహెర్‌బాబా మాసపత్రిక మీకు సకాలంలో రాకుంటే దయచేసి శ్రీ యన్. మహేశ్వర్‌రావు -040- 27964050, 9441218841, శ్రీ కె.యస్. ఓం ప్రకాశ్- 94403-65640, హైదరాబాద్‌లను సంప్రదించగలరు.

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310 Postal Concession: R&D/
RNP/789/2009-11, Dt.07-01-2009

# మెహెర్‌బాబా

**అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక**

సంపుటి : 8 సంచిక: 06 హైదరాబాద్ 2009 నవంబరు పేజీలు: 40

**Please visit : www.srimeherbaba.com** వార్షిక సభ్యత్వం : రూ.**100/-**



# నిజామాబాద్ సెంటర్ 37వ వార్షికోత్సవం

## 2009 డిశెంబరు 5,6 తేదీలలో...

నిజామాబాద్ సెంటర్ 37వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా డిశెంబరు 5,6 తేదీలలో ప్రేమిక సహవాస్ ఏర్పాటుచేసినట్లు శ్రీ ఏ. జనార్ధనరావు ( 9908785774) ఒక ప్రకటనలో తెలిపారు. బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనవల్సిందిగా ఆయన కోరారు. మరిన్ని వివరాలకు నిజామాబాద్ బాబా సెంటర్, ఎల్లమ్మ గుట్ట, నిజామాబాద్ – 503 001. ఫోన్. 99087 85774 సంప్రదించగలరు

**నిజామాబాద్ పట్టణంలో రాత్రిపూట చలి ఎక్కువగా వుంటోంది. విచ్చేసే బాబా ప్రేమికులు వెచ్చదనాన్నిచ్చే దుప్పట్లు, ఉన్ని దుస్తులు ఏవైనా వీలునుబట్టి తమతో తీసుకురావల్సిందిగా శ్రీ జనార్ధనరావు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.**

# రాజమండ్రిలో



రాజమండ్రి సెంటర్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా బాబా ప్రేమిక సహవాస్ నవంబరు 29 తేదీన ఉ.9 నుండి 1 గంట వరకూ నిర్వహిస్తున్నట్లు స్థానిక బాబా సెంటర్ అధ్యక్షులు శ్రీ నారాయణరావు, కార్యదర్శి శ్రీ కోరుకొండ మహేష్ కుమార్ (98851-18988) సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు.

# తణుకులో ప్రేమిక సహవాస్

శ్రీ పి.వి.యస్.యన్.శర్మ రిటైర్డ్ ఇంజినీర్ (ఇరిగేషన్) గారి ఇంట్లో - (ఇ.నెం.35-33-6) బొమ్మలవీధి, తణుకులో 08.11.2009 ఆదివారం ఉ.8.30 నుండి బాబా ప్రేమిక సహవాస్ నిర్వహిస్తున్నట్లు ఆహ్వానం పంపారు.

## పత్రిక పదివేల సైన్యంబు

మెహెర్‌బాబా పత్రికను చదవండి! మెహెర్ నామవ్యాప్తికి దోహదపడండి. ఒక్కొక్కరూ ఐదుగురినైనా క్రొత్త సభ్యులుగా చేర్పించండి!!

మీ స్నేహితులు, బంధువులను ముందుగా ఇందులో ఎంపిక చెయగలరు.





## బాబా సందేశం



**To Love God in the most practical way is to Love our fellow beings.**

నిత్య జీవితంలో భగవంతుని ప్రేమించడమంటే, మన తోటి మానవులను ప్రేమించుటయే...

– మెహెర్‌బాబా

గౌరవ సంపాదకులు
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**krishnanandm@yahoo.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
040-65699611
040-64542370

## లోపలి పేజీలలో...


| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం | 5 |
| 2. | సర్మద్ | 6-11 |
| 3. | బాబా ట్రస్ట్ వివరాలు | 12-13 |
| 4. | డెహ్రాడూన్ వార్షికోత్సవం | 15-19 |
| 5. | లార్డ్‌మెహెర్ | 20-25 |
| 6 | ఆంధ్రా రెస్ట్‌హౌస్ | 26 |
| 7. | ఖాజోగూడా | 27 |
| 8. | బందరు బాబా సహవాస్ | 28-29 |
| 9. | కొత్త పుస్తకం | 30 |
| 10. | మెహెర్‌బాబా సమాధి | 33-35 |
| 11. | బాటసారులు | 36-37 |
| 12. | జూబ్లీహిల్సు సెంటర్ | 38 |


**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం.32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

## మనవి

మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. మీకు 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.

Please visit : www.srimeherbaba.com

# అవతారుని 41వ అమరతిథి

41వ అవతారుని అమరతిథి సందర్భంగా 2010 జనవరి 30 ఉదయం 8 గంటల నుండి ఫిబ్రవరి 1, మధ్యాహ్నం 12 గంటలదాకా ఎగువ మెహెరాబాద్‌లోని బాబా సమాధి సమక్షంలో పలు కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు, యావన్మంది బాబా ప్రేమికులు అమరతిథికి హజరుకావల్సిందిగా బాబా ట్రస్ట్, చైర్మన్, శ్రీ భావూకల్చూరి ఒక ప్రకటనలో కోరారు. యాత్రికులను జనవరి 30 ఉదయం 8 గంటల నుంచి మెహెరాబాద్‌లో ఏర్పాటుచేసే బసలోనికి అనుమతిస్తారని ఆయన అన్నారు. అమరతిథికి హాజరు కాగోరువారు దిగువ మెహెరాబాద్‌లో తగిన వసతి సౌకర్యం పొందగోరువారు, "**అమరతిథి డొనేషన్స్ పేరున** రూ.50/- మనీ ఆర్డర్ లేదా బ్యాంక్ డ్రాఫ్ట్ ద్వారా **2010 జనవరి 7లోగా** అందునట్లు ఈ క్రింది అడ్రస్సుకు పంపవల్సింది. ఈ నగదు పంపుతూ అమరతిథిలో పాల్గొనే స్త్రీ, పురుషుల వివరాలు విడివిడిగా ప్రత్యేకంగా తెలియజేయవల్సిందిగా ఆయన కోరారు.

**అడ్రస్సు - అమరతిథి డొనేషన్స్, అవతార్ మెహెర్‌బాబా పి.పి.సి. ట్రస్టు, పోస్ట్‌బ్యాగ్ నెం. 31, కింగ్స్ రోడ్, అహ్మద్‌నగర్, మహారాష్ట్ర - 414 001.**

జనవరి 30 నుండి మెహెరాబాద్‌కు విచ్చేయు ప్రేమికుల సౌకర్యార్థం అహ్మద్‌నగర్ రైలు స్టేషన్, బస్టాండ్‌లనుండి స్థానిక ఆర్.టి.సి బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సాంస్కృతిక కార్యక్రమాలో పాల్గొనగోరువారు శ్రీ మెహెర్‌నాథ్. బి.కల్చూరీ,అవతార్ మెహెర్‌బాబా పి.పి.సి ట్రస్టు, పోస్ట్ బ్యాగ్ నెం.31, కింగ్స్ రోడ్, **అహ్మద్‌నగర్,** మహారాష్ట్ర-414 001, చిరునామాకు 2009 డిసెంబరు 31వ తేదీ లోపల తెలియచెయ్యాలని వారు కోరారు. అలాగే పరుపులు అద్దెకు తీసుకొనదలచినవారు రూ.45/- చొప్పున ఈ క్రింది అడ్రస్సుకు పంపవల్సింది. **శ్రీ అశోక్ సేర్, విలాస్ మండప్, శని చౌక్, జునా మంగల్‌వార్ బజార్, అహ్మద్‌నగర్, మహారాష్ట్ర - 414 001.** ముందుగా అమరతిథి డొనేషన్స్ పంపలేనివారు, దిగువ మెహెరాబాద్‌లోని ఎంక్వైరీ కౌంటర్‌లో రూ.100/- చెల్లించి ఎంట్రీ టోకెన్ పొందవచ్చునని శ్రీ భావూ పేర్కొన్నారు.

**కాగా, మెహెరాబాద్‌లోని ఆంధ్రా రెస్ట్ హౌస్‌లో కూడా ఈ దఫా సుమారు 110 మందికి పైగా వసతి సౌకర్యం కల్పించనున్నట్లు కార్యదర్శి శ్రీ వై.యస్. రావ్ (09848111671) తెలిపారు.**

అమరతిథికి మెహెరాబాద్‌దాకా వెళ్ళలేనివారు, అవతారుడు సమాధి అయిన రోజు - జనవరి 31న, మధ్యాహ్నం 12 నుండి 12.15దాకా వారెక్కడున్నా సరే, బాబావారిని స్మరిస్తూ మౌనం వుండవల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఆ రోజున సమీప బాబా సెంటర్‌ను తప్పక సందర్శించవల్సిందని సూచించారు.





సంపాదకీయం

# బర్త్ డే సందేశం

అవతారుని 41వ అమరతిథికి, ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలాగే, మరోచెంప అవతారుని జన్మదిన వేడుకలు చాలా ప్రాంతాల్లో నవంబరు 15 నుండి ప్రారంభిస్తున్నారు. మెహెర్‌బాబా 1894 ఫిబ్రవరి 25న పూనేలో ససూన్ ఆసుపత్రిలో జన్మించారు. ఇది అవతారుని 116వ జన్మదినోత్సం. 1968లో బాబా 74 జన్మదినోత్సవం సందర్భంగా ఆయన తమ మండలివారితో - తెలుగు వారు ఫిబ్రవరి 25 కంటే 74 రోజుల ముందుగా ప్రతి రోజూ సత్సంగ్ కార్యక్రమాలు, భజనలు, నృత్యాలు, నాటికలతో **నా బర్త్‌డేని** కడు వేడుకగా జరుపుకుంటారని బాబా స్వయంగా పేర్కొన్నారు. తెలుగువారు చేపట్టే బాబా జన్మదినోత్సవాల వేడుకల పట్ల అవతారుడు అమితానంద భరితులయ్యేవారు.

నవంబరు 15 నుండి ప్రారంభమయ్యే అవతారుని జన్మదిన వేడుకలకు హైదరాబాద్ సెంటర్ తగిన ప్రణాళికలు ఇప్పటికే తయారుచేసింది. ప్రత్యేక కమిటీలు ఏర్పాటయ్యాయి. ఎంత దూరమైనా ఈ కమిటీ సభ్యులు క్రమం తప్పక ప్రతిరోజూ జరిగే బాబా కార్యక్రమాలకు హాజరవుతారు. ఇది అభినందనీయం. ప్రతి రోజు సాయంత్రంపూట జరిగే సత్సంగ్‌లతో పాటు ప్రతి ఆదివారం తెల్లవారుఝామున 5 నుండి 6 దాకా బాబావారి నామం జపిస్తూ, తీవ్ర చలిలో నగర సంకీర్తన కార్యక్రమాలకు కూడా ఈ కమిటీ సభ్యులు తప్పక హాజరవుతారు. హైదరాబాద్‌లో ఒక చోట నుంచి మరోచోటకు వెళ్ళాలంటే ఓ రోజు ప్రయాణంలా వుంటుంది . అందుకని నగర సంకీర్తన కోసం వీరు ముందురోజు రాత్రికే కార్యక్రమ నిర్వాహకుల ఇళ్ళకు వెళ్ళి అక్కడే బస చేస్తారు. ఇదంతా మెహెర్‌బాబా పట్ల వారికున్న ప్రేమ, భక్తి వల్లనే సాధ్యమౌతోందంటే అతిశయోక్తికాదు. ఏమాటకామాట చెప్పుకోవాలి- ఈ కార్యవర్గంలో శ్రీ అప్పారావ్, కూకట్‌పల్లి సేవలు అగ్రభాగాన వుంటాయన్నది నిజం.

ఐతే, తెలుగు ప్రాంతాల్లో బాబా జన్మ దిన వేడుకలు ఇదే మాదిరిగా చాలా సెంటర్లలో జరుపుతారు. హైదరాబాద్ సెంటర్‌ను ఒక ఉదాహరణగా మాత్రం ప్రస్తావించడం జరిగింది.ఏది ఏమైనా బాబావారి జన్మదినోత్సవ వేడుకలు అన్ని బాబా సెంటర్లలో మరింత ఇనుమడించిన ఉత్సాహంతో, ప్రేమతో జరుపుకుందాం.

**ఈ విషయంలో మెహెర్‌బాబా ఓ సందేశంలో ఏమన్నారు?**

"నేనేదో బహుమతి ఇస్తానని నన్ను ప్రేమించ వద్దు. అలా చేయడం శుష్క దండుగ. అలాగే, నేనిచ్చే నజరానాల కోసం మీరేమీ త్యాగాలు చేయొద్దు. ఆలాచేస్తే అది ఓ గ్రుడ్డివాడు తన కళ్ళను దానం ఇచ్చినట్లే. నేను ఈ యుగావతారుడిని. నేను ప్రేమావతారుడ్ని. నన్ను ప్రేమించవల్సిన రీతిలో ప్రేమించండి. తద్వారా నా కృపకు పాత్రులు కాగలరని బాబా ఒక సందేశంలో పేర్కొన్నారు".

బాబావారి ఈ సందేశం మనకు ప్రాత స్మరణీయం కావాలి.

చారిత్రకం

# సర్మద్

శ్రీ బి.క్రిష్ణయ్య,
Central Excise Supdt. (Rtd.)



**అవతార్ మెహెర్‌బాబా తన మండలి వారికి చెప్పిన విషయాలివి.**

బాబా మండలి సభ్యులు–

సో. ఏరుచ్, మెహెరాజాద్‌కు విచ్చేసిన బాబా ప్రేమికులను ఉద్దేశించి, బాబా తమకు చెప్పిన విషయాలను, అనేక జ్ఞాపకాలను తరచు చెప్తుండేవారు.

పాశ్చాత్య బాబా ప్రేమికుడు – William Lepage,

అలా తాను విన్న విషయాలన్నింటినీ

**IT SO HAPPEND**

**Stories from days with Meher Baba**

పేరున సంకలనం చేశాడు. కాగా, హైదరాబాద్ సెంటర్ బాబా ప్రేమికులు, శ్రీ బి.క్రిష్ణయ్య, Central Excise Supdt. (Rtd.) ఆ గ్రంథంలోగల ఒక అంశం "సర్మద్" (పేజి 65–67) చదివి, "మెహెర్‌బాబా" పాఠకులందరికీ తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఇంగ్లీషులో వున్న ఆ శీర్షికను తెలుగులో అనువదించి ప్రచురణార్థం మాకు పంపారు. వీరు పంపిన ఆ అనువాదాన్ని యథాతథంగా ప్రచురిస్తున్నాం. దయచేసి పరిశీలించగలరు.

**– ఎడిటర్**

**మె**హెర్‌బాబా చెప్పిన ఈ కథాంశం మొఘలు సామ్రాజ్యాధిపతి, బహు పరాక్రమవంతుడైన ఔరంగజేబుకు సంబంధించినది.

మొఘలు చక్రవర్తి ఔరంగజేబు బహు పరాక్రమవంతుడు. ఓ గొప్ప సామ్రాజ్యాధినేత. ఇంతవరకే చాలామంది చరిత్రకారులకు తెలుసు. హైదరాబాద్ నగరాన్ని పాలించిన





కులీకుతుబ్‌షాహీ రాజులలో కడపటి వాడైన "తానీషాను" భీకర యుద్ధంలో ఓడించి తానీషాను బంధీ చేసి గోల్కొండ రాజ్యాన్ని తన కైవసం చేసుకున్న రాజాధిరాజుగా, పరాక్రమశీలిగా చరిత్రకారులు కొనియాడతారు.

ఐతే, ఈ మొఘలు చక్రవర్తి వెనుక గొప్ప ఆధ్యాత్మిక శక్తి వుందని– బహుశా చాలా కొద్దిమందికే తెలుసుంటుంది. మెహెర్‌బాబా ఔరంగజేబు గురించి ఏమన్నారో తెలుసా?

ఔరంగజేబు ఆదర్శమైన చక్రవర్తి మాత్రమే కాదు. సాంప్రదాయ ముస్లిం ఆచారాలను, మహ్మద్ ప్రవక్త అడుగుజాడల్లో తూ.చ. తప్పక నడుచుకోవాలని ప్రయత్నించే గొప్ప సాంప్రదాయవాది, మంచి మనీషి అన్నారు.

ఔరంగజేబు తన రాజ్యంలో గల అపార నిధి, సంపదలపై తన జీవనం ఏనాడూ గడపలేదు. తన రాజ్యంలోని నిధి నిక్షేపాలను ప్రజల సంక్షేమం కోసం మాత్రమే వినియోగించాడు కానీ, తానుగా ఆ ప్రభుత్వ ధనాన్ని ఆతను ఏనాడూ తాకలేదు.

ఆశ్చర్యకర విషయం ఏమంటే, తన కడుపు నింపుకోవడానికి, తన తిండికోసం, తన జీవన భృతి కోసం, ముస్లింలు మసీదుల్లో ప్రార్థనలకు వెళ్ళేటప్పుడు వాడే టోపీలు కుట్టి, వాటిని అమ్మి– అలా వచ్చిన డబ్బుని మాత్రమే తన జీవన భృతికి వినియోగించేవాడు. అలాగే, ఖురాన్ కాపీలు తయారు చేసి, వాటిని అమ్మగా వచ్చిన సొమ్ముని మాత్రమే తన కోసంగా వాడుకునేవాడు.

నిరంతరం భగవంతుని ధ్యాసలో వుండేవాడు.

దేముని కృప కోరుకునేవాడు.

ముస్లిం మత పెద్దల ఆచారాల ప్రకారం నడుచుకొనేవాడు.

ఒక సందర్భంలో చక్రవర్తికి ఒక ఆలోచన మెరుపులా మెరిసింది.

తన ప్రజలందరూ, భగవంతుడైన అల్లాను ప్రార్థించేందుకు వీలుగా, ఓ పెద్ద, విశాలమైన ప్రాంగణంలో మహ్మద్ మసీదు ఏర్పాటు చేయాలని తలంపు వచ్చింది. దీనివల్ల పలువురు ఒకే చోట, ఒకే హృదయంతో భగవంతుడిని ప్రార్థించుకునే వీలు కలుగుతుందని భావించాడాయన.

ఆలోచన వచ్చిందే తడవుగా– మహ్మద్ ప్రవక్త మసీదు నిర్మాణం చేపట్టి అనతికాలంలోనే పూర్తి చేశారు.

ప్రతి ఒక్కరూ మసీదులో ప్రార్థనా సమయంలో కూర్చుని ప్రార్థించుకునేలా ఏర్పాటు చేశారు.

వీలున్న సమయంలో, ప్రార్థనలకు చక్రవర్తి కూడా హాజరవుతుండేవాడు.

ఆ తర్వాత కొద్దికాలానికి మసీదులో ప్రార్థనలకు ప్రజలందరూ హాజరవుతున్నారా? అని తన సహచరులతో చక్రవర్తి వాకబు చేశాడు.

అందరూ వస్తున్నారా?

ఈ గొప్ప మసీదు నిర్మాణం గురించి ఏమంటున్నారు?

ఈ విషయమై ప్రజలు ఆనందంగా వున్నారా? లేదా? అని తన వారితో విచారించాడు.

అందుకు సమాధానంగా మహాప్రభూ! అందరూ ప్రార్థనలకు హాజరవుతున్నారు. ఒకే ఒక్కడు మాత్రం ఎంతగా వేడుకున్నా అతను మా మాటల్ని ఖాతరు చేయడం లేదు అని జవాబుగా వారు చెప్పారు.

ఆ వ్యక్తి ఎవరిని తీవ్ర స్వరంతో చక్రవర్తి ప్రశ్నించారు.

చక్రవర్తి ఆదేశాలు ఏమిటో ఆతనికి తెలియవా? అని కళ్ళెర్రజేశాడు.

నా రాజ్యంలో ప్రతి ఒక్కరూ ఈ మసీదులోనే ప్రార్థనలు చేయాలని ఆతనికి తెలియదా? అని ప్రశ్నించాడు.

మహారాజా- ఆతనికి అన్ని విషయాలు తెలుసు. తెలుసుండీకూడా- ఒక్క అంగుళం కదలకుండా ఎక్కడ కూర్చుంటున్నాడో అక్కడే వుంటున్నాడు కానీ, మామాటలు ఆతను లక్ష్యపెట్టడం లేదని రాజాధికారులు చెప్పారు.

ఆతను ప్రతిరోజూ మసీదులో ప్రార్థనలు తప్పనిసరిగా చేయాలని మా శాసనంగా చెప్పండని - ఔరంగజేబు తిరిగి హుకుం జారీ చేశాడు.

అవన్నీ చెప్పడమయింది ప్రభూ! కానీ ఆతను కూర్చున్నచోట నుంచి అంగుళం కదలడానికి ఒప్పుకోవడం లేదు అని వారు సమాధానమిచ్చారు.

అలాగయితే, బలవంతంగానైనా ఎత్తుకుని మసీదులో కూర్చోబెట్టండి.

భగవంతుని ప్రార్థనలు చేసి తీరాలని హుకుం జారీ చేశామని చెప్పండి అన్నారు.

చక్రవర్తి ఆదేశాల మేరకు ఆ మర్నాడు ఆ వ్యక్తిని బలవంతంగా, మొరటుగా, ఎత్తుకుని మసీదుకు తీసుకెళ్ళారు. మసీదులో అందరూ భగవంతునికి ప్రణమిల్లుతూ ప్రార్థనలు చేస్తుంటే, ఈతను మాత్రం నిలబడే వున్నాడు.

చక్రవర్తి ఔరంగజేబు కూడా ఆ ప్రార్థనా సమయంలో అక్కడే వున్నారు.

అంతా నిశ్శబ్దంగా వుంది.

మసీదులో **ముల్లా** బిగ్గరగా ప్రార్థనలు చేస్తున్నాడు.

ఇంతలో- అకస్మాత్తుగా- అందర్నీ ఆశ్చర్యచకితులను చేశేలా-

ఈ వ్యక్తి,

ఓరి వెర్రివాడా....

భగవంతుడా! ఆతడు... ఇదిగో .... నా పాదాల క్రింద వున్నాడు.

"Your Damned God is Under my foot!" అని గట్టిగా అరిచి, అక్కడ్నుంచి వడివడిగా.. .... చకచకా నడుచుకుంటూ వేగంగా వెళ్ళిపోయాడు.





చక్రవర్తి అక్కడే వున్నారు?

ప్రార్థనలు చేస్తున్నవారందరూ హతాశులయ్యారు.

ఇలా ఎవరైనా ఓ గొప్ప చక్రవర్తి సమక్షంలో ప్రవర్తించగలరా?

ఇందుకు ఎంతటి ధైర్య సాహసాలు కావాలి? ఇతనెవరో కదా? అని అందరూ భయకంపితులయ్యారు.

ఈ విషయాన్ని ఓ శాసనోల్లంఘనగా పరిగణించారు.

ప్రార్థనలు ముగిశాక చక్రవర్తి తన మంత్రులకేసి తిరిగి చూశాడు.

"ప్రార్థనల మధ్యలో ఇంతటి ధైర్యానికి పూనుకున్నవారు కఠిన శిక్షకు అర్హులు. ఇలాంటి వారికి శిక్ష - **ఉరిశిక్ష** - తప్పనిసరి, అని చక్రవర్తి హుకుం జారీ చేశారు.

వెనువెంటనే ఉరిశిక్ష అమలు జరిపారు.

ఆ వ్యక్తికి ఉరితీశారు.

ఆ వ్యక్తికి ఉరితీయడమయితే జరిగిపోయింది కానీ, చక్రవర్తి మనస్సు ఛిద్రమయింది.

ఆయనికి మనశ్శాంతి కరవయింది.

మసీదులో ప్రార్థనలు చేయని కారణంగా ఆ వ్యక్తికి ఉరితీత తీయడం చాలా క్రూరమైందిగా, హీనమైన చర్యగా, తాను తప్పుచేసినట్లు ఔరంగజేబు పశ్చాత్తాపడ్డాడు.

ఔరంగజేబు చక్రవర్తి సున్నిత, సునిశిత స్వభావం గలవాడు.

మహా గొప్ప మేధావి. గొప్ప మనీషి కూడా.

ఓ రోజున మంత్రులందర్నీ కూడా వెంటబెట్టుకుని మసీదుకు వెళ్ళి, ఆ వ్యక్తి ఆ విధంగా మాట్లాడాడు అంటే, తగిన కారణం వుండి వుంటుంది.

ఆ కారణం ఏమిటో తెలుసుకోవాలన్నాడు, తన ప్రధానమంత్రితో.

ఆతను ఆ రోజున మసీదులో ఎక్కడ నిల్చున్నాడో, ఎక్కడ్నుంచి అలా గట్టిగా అరిచాడో పరిశీలించాడు.

ఆతను గట్టిగా కేక పెట్టిన ప్రదేశానికి వెళ్ళి- అక్కడికి దగ్గరగా నిల్చున్నాడు.

మసీదులోని **ముల్లాని** కూడా అక్కడికి దగ్గరగా రమ్మని చక్రవర్తి ఔరంగజేబు ఆదేశించాడు.

ముల్లానుద్దేశించి - ఎలాంటి సంశయం లేకుండా, నిజం చెప్పమన్నాడు.

ఆ వ్యక్తి - గట్టిగా కేకలు పెట్టుకుంటూ వెళ్ళిన రోజున, మీరు ప్రార్థన చేసినప్పుడు - మీ మనస్సు ఎలా వుంది? అని ఔరంగజేబు ముల్లాని ప్రశ్నించాడు.

ఆ సమయంలో మీరు భగవధ్యాసలోనే వున్నారా? అని తిరిగి ముల్లాని ఔరంగజేబు ప్రశ్నించాడు.

క్షణకాలం దేవుని ధ్యాసలోనే వున్నా, ఆ రోజున నా మనస్సు మిమ్ముల్ని ఆకర్షించాలని పరితపించింది.

నా కూతురి వివాహం తలపెట్టాను.

నేను చేసే ప్రార్ధనలతో మిమ్ముల్ని మరింతగా ఆకర్షించి, మీమెప్పు, మీరిచ్చే నగదు బహుమతులు అనేకం అందుకోవాలని తహతహలాడింది.

మీరిచ్చే నగదు బహుమతితో నా కూతురు పెళ్ళి వైభవంగా జరపాలనుకున్నాను, అని ముల్లా తన మనస్సులో ఆ రోజున పడిన వేదన, ఆవేదన గురించి నిజాలను చక్రవర్తికి చెప్పాడు.

అలాగా?

అయితే, ఆ వ్యక్తి ఎక్కడ నిల్చున్నాడో- అక్కడ భూమిని త్రవ్వమని ఔరంగజేబు ఆదేశించాడు.

అలా త్రవ్వితే ఏముంది?

గొప్ప నిధి కనిపించింది. అనేక నగలూ, బంగారపు రాశులూ కన్పించాయి.

అందుకనే కదా...

ఆ వ్యక్తి " Your Damned God is Under my foot!".....

నీవు ప్రార్ధించే ఆ దేవుడు, నా పాదాల క్రింద వున్నాడని కేక పెట్టాడని, చక్రవర్తి అన్నాడు.

ఆ సమయంలో ముల్లా మనస్సులో ప్రార్ధించిన దేవుడు - ఈ నగలూ- నిధులూ గురించే కానీ, నిజమైన దైవ భక్తి మృగ్యం కదా అనే వుద్దేశ్యంతో, ఆ వ్యక్తి అలా గట్టిగా అరిచాడని అందరూ భావించారు.

ఆ వ్యక్తి ఎవరో ..... అసమాన్యుడు.

ఆతను తప్పక ఓ **"మస్తు".**

మస్తులందరికీ అతనొక పెద్దగా (Head of the Masts ) - **సర్మద్** గా ఆ తర్వాత చక్రవర్తిగారి విచారణలో తేలింది.

నేను ఆతనికి విధించిన ఉరి శిక్ష వల్ల నాకు ఈ ప్రపంచంలో శాంతి లభించదని - చక్రవర్తి ప్రకటించాడు.

ఇందుకు పరిష్కృతిగా, ప్రాయశ్చిత్తంగా, తన మరణాంతరం తన శరీరాన్ని ముక్కలు ముక్కలుగా చేయాలని, ఒక్కో ముక్కను ఏదేని పవిత్ర ప్రదేశాలలో భగవంతుని కృప లభించేలా, ఎలాంటి ఆడంబరాలు లేకుండా సమాధి చేయమని తన వీలూనామాలో ఔరంగజేబు పేర్కొన్నాడు.

తద్వారా తనకు మనశ్శాంతి లభిస్తుందని అన్నాడు.





ఔరంగజేబు మరణానంతరం, చక్రవర్తి కోరినట్లే, ఆయన శరీర భాగాలపై, అత్యంత నిరాడంబర సమాధులు నిర్మించారు.

ఔరంగజేబు భార్య కూడా ఇదే మాదిరిగా తన మరణానంతరం ఎలాంటి ఆడంబరాలు లేని సమాధి నిర్మాణం జరగాలని కోరుకుంది.

ఐతే, ఆమె కుమారులు ఆమె ఇచ్ఛ ప్రకారం చేసినా- ఔరంగాబాద్‌లో మినీ తాజ్‌మహల్ నిర్మించారు.

ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతంకాదు. It is Ephemeral. - ఇదంతా క్షణికం.

మహా రాజులు- చక్రవర్తులు వస్తుంటారు- నిష్క్రమిస్తుంటారు. మహా సామ్రాజ్యాల నిర్మాణం చేస్తారు. ఐతే, ఇవన్నీ అశాశ్వతం. ఇదే నడుస్తున్న చరిత్ర అని- ఔరంగజేబు భావించాడు అని మెహెర్‌బాబా ఆ గొప్ప చక్రవర్తి ఆధ్యాత్మిక చింతన గురించి చెప్పారని ఏరుచ్ వివరించారు.

పాఠకులు ఈ శీర్షికపై తమ అభిప్రాయాలు, స్పందన, 2009 డిశంబరు 10లోగా రాసి పంపగలరు. లేదా ఇ-మెయిల్ **krishnanandm@yahoo.com Mobile: 99595-53218** తెలియజేయగలరు.

# యువత

ఒక బాబా ప్రేమికుడు - యువకుడు - మెహెర్‌బాబా పత్రిక నిర్వహణకై తన వంతుగా ప్రతి నెలా ప్రస్తుతానికి రూ.500/- చొప్పున ఇవ్వగలనని ప్రకటించారు. 2009 ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు గాను ఆ మాదిరిగా ఇప్పటిదాకా రూ. 1500/- ఇచ్చారు. అయితే, తన పేరు వివరాలు ప్రచురించవద్దని ఆ యువకుడు కోరాడు. **ప్రతి పైసా రాక-పోక** ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నది మెహెర్‌బాబా పత్రిక ఆశయం కాబట్టి, సభ్యుల సమాచార నిమిత్తం తప్పని పరిస్థితులో ప్రచురిస్తున్నాం.

# అనంతపురం

అనంతపురం కేంద్రంలో 25.10.2009న కేంద్ర ప్రథమ వార్షికోత్సవం అత్యంత వైభవంగా జరుపుకున్నట్లు అధ్యక్షులు శ్రీ సుంకు క్రిష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

బాబా చిత్రపటంతో, నామస్మరణతో ఉ.9.30 ని॥ల నుండి 10.30 ని॥ ల వరకు ఊరేగింపు, అనంతరం మెహెర్ ప్రేమిక సహవాస్ జరుపుకున్నట్లు ఆయన అన్నారు. శ్రీ పి.బలరాం, శ్రీమతి శాంత, శ్రీమతి సుగుణ, కుమారి ప్రకాషిని, కుమారి అరుంధతి, మాధవి, తదితరులు గానం చేశారు. బిలవడ్ బాబా "ఎడిటర్" శ్రీ యం.మల్లికార్జున రావ్, శ్రీ ఎ. రాంకుమార్, హిందూపూర్, తదితరులు బాబా సందేశాలపై ప్రసంగించారు.

# బాబా ట్రస్టుకు విరాళాలు

అహ్మద్‌నగర్‌లో గల మెహెర్‌బాబా ట్రస్టుకు ప్రతి ఒక్కరూ క్రమం తప్పక విరాళాలు పంపి, ట్రస్టువారు చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలలో సహకరించవల్సిందిగా శ్రీమతి గీతా జయరాం, బెంగుళూరు నుండి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఆమె తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ, చాలాకాలం వరకూ ఆంధ్రా ప్రాంతంలో విజయవాడ బాబా సెంటర్ చాలా చురుకుగా, పలు బాబా కార్యక్రమాలు నిర్వహిస్తుండేది. శ్రీ మాణిక్యారావు, శ్రీ ఎ.వి.రాఘవులు తదితర పెద్దలు, 1984 దాకా బెజవాడ సెంటర్‌లోని ప్రతి బాబా ప్రేమికుని నుంచి ఎంతో కొంత విరాళాలు సేకరించి ప్రతి నెలా బాబా ట్రస్టుకు పంపుతుండేవారు. ఆ దరిమలా ఏ కారణంగానో ఈ విధానాన్ని నిలిపి వేశారు. బహుశా అమెరికా, ఆస్ట్రేలియా వంటి యితర దేశాలనుంచి అధిక మొత్తంలో విదేశీ బాబా ప్రేమికులు విరాళాలు అందజేస్తుండటంతో ఈ విధానానికి స్వస్తి పలికినట్లున్నారని ఆమె అన్నారు.

అలాగే, 1970 ప్రాంతంలో, అప్పటి బాబా ట్రస్టు చైర్మన్ శ్రీ టి.కుటుంబశాస్త్రి, ట్రస్టు కార్యకలాపాల నిర్వహణకై బాబా ప్రేమికులందర్నీ ప్రతి ఆరు నెలలకు ఒకమారైనా ఎంతో కొంత మొత్తం ట్రస్టువారికి అందేలాగా పంపవల్సిందని పలుమార్లు చేసిన విజ్ఞప్తులు ఆనాటి బాబావారి మాస పత్రికలు **'దివ్యవాణి'**, **'అవతార్ మెహెర్‌లలో'** చూడవచ్చు. శ్రీ శాస్త్రి గారు ఏమని సూచించేవారంటే, స్వఛ్ఛందంగా – ఇష్టపూర్వకంగా బాబా ట్రస్టుకు విరాళాలు పంపగోరువారు, రోజుకి కనీసం పది పైసలు, లేదా 20 పై, 30 పై. (ఇవి ఆనాటి ధర వరులను బట్టి) ప్రక్కన బెట్టి, అలా ప్రోగయిన సుమారు ఆరేడువందలను ఆరునెలలకొకమారు ప్రతి ఒక్కరూ నేరుగా ట్రస్టుకు విరాళంగా పంపవల్సిందని కోరేవారు. బాబా వారు ఏర్పాటుచేసిన ట్రస్టును 1969 ఆగస్టులో పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్టుగా రిజిష్టరు చేశారు.

క్రమేణా 1980వ దశకం తర్వాత ట్రస్టు విరాళాల కోసం విజ్ఞప్తి చేయడం మానివేసింది. ఐతే, నేడు ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన ఆర్థిక మాంద్య ప్రభావం బాబా ట్రస్టుపై కూడా బలీయంగా వుండటం, అలాగే ఎవరికివారు **అంతా బాగుంది** అనే ధోరణిలో విరాళాలు పంపకపోతుండటంతో నేడు ట్రస్టు ఆర్థిక ఇబ్బందుల్లో వుందని చెప్పాలి. ఇందుకోసమేనన్నట్లు ట్రస్టు చైర్మన్, భావూజీ కూడా బాబా ప్రేమికులను ప్రేమ విరాళాలు పంపవల్సిందిగా కోరుతున్నారు. హైదరాబాద్ సెంటర్ మాదిరి ప్రతి బాబా సెంటర్ ప్రేమికులు ముందుకొచ్చి తగిన విధంగా స్పందించాలని మా మనవి.

***– గీతా జయరాం,***





**మెహెరాబాద్ నుంచి శ్రీ వై.ఎస్.రావు ఈ విషయమై .. ...**

అవతార్ మెహెర్‌బాబా పి.పి.సి. ట్రస్టుకు ప్రేమతో విరాళములు అందరూ తప్పని సరిగా వారి వారి స్తోమతను బట్టి మని ఆర్డరు/ బ్యాంకు చెక్కు ద్వారా అందజేయవల్సింది.

**అడ్రస్–** ఛైర్మన్, అవతార్ మెహెర్‌బాబా పి.పి.సి.ట్రస్టు, కింగ్స్‌రోడ్డు, అహమ్మద్‌నగర్– 414001, మహారాష్ట్ర (ఇండియా). ఇందుకు ఆదాయపు పన్ను రాయితీ కూడా కలదు.

# పగడదిన్నె క్యాంపు

అవతార్ మెహెర్ బాబా ఆధ్యాత్మిక కేంద్రము పగడదిన్నె క్యాంపు, కర్నాటక, దశమ వార్షిక ప్రేమిక సహవాస్ 24.10.2009 శనివారం ఉ॥ 9 గం॥ లకు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించబడినది. మెహెర్ మణి , శ్రీ ఎమ్.శివప్రసాద్, హిందూపూర్, శ్రీ జి.ఎస్.ప్రకాశరావు శ్రీకాకుళం, శ్రీ పుట్టా జయకృష్ణ, శ్రీ వి. హరిబాబు, శ్రీ మెహెరు సాయి, శ్రీ రవితేజ, శ్రీమతి డా॥పూడి హేమలత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సావనీర్‌ను ప్రచురించి విడుదల చేశారు. స్థానిక శాసనసభ్యులు వెంకట్రావు నాడ గౌడ, శ్రీ ఎ.ఎన్.రాజగోపాల్, బెంగళూరు, శ్రీ పూడి రాజు, రాజమండ్రి, అధ్యక్షులు, శ్రీ చిక్కిన రామకృష్ణ, కార్యదర్శి (కన్వీనర్) శ్రీ వల్లూరి గాంధీ ప్రేమికులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఆనంతరం, పలు బాబా సెంటర్ల వారిచే సంకీర్తనలతో నాటి కార్యక్రమం ముగిసినది. 25.10.2009 ఆదివారం ప్రధాన వీధుల గుండా ఉదయం 6 నుండి 7 దాకా నగర సంకీర్తన , ఉ॥ 7 గం॥లకు బాబా ప్రార్థన 7.30 ని॥ సప్తవర్ణ పతాక ఆవిష్కరణ చేసినట్లు శ్రీ వల్లూరి గాంధీ తెలిపారు.

# మెహెరాస్తానా ఆధ్యాత్మిక కేంద్రము

### 8వ వార్షికోత్సవం 15.11.2009 ఆదివారం

మెహెర్‌బాబా తన రెండవ ఆంధ్రా పర్యటనలో 02.02.1954న పశ్చిమ గోదావరిజిల్లా ఉంగుటూరు మండలం రామచంద్రపురం గ్రామములో నున్న బాలగోపాల సోదరుల స్వగృహమునకు విచ్చేసినారు. బాబా పాదస్పర్శచేత పునీతమైన స్థలము నేడు మెహెరాస్తానా ఆధ్యాత్మిక కేంద్రముగా వెలసిల్లుతున్నది. మెహెరాస్తానా 8వ వార్షికోత్సవాన్ని 15.11.2009 ఆదివారం నాడు జరుపుతున్నట్లు గౌరవ అధ్యక్షులు, బాలగోపాల బాస్కరరాజు ఆహ్వానం పంపారు.

# భైరమంగళ సందర్శన- మా అనుభూతి

**- డాక్టర్ వై. విజయసారథి**

భైరమంగళంలో బాబావారి విశ్వ ఆధ్యాత్మిక కేంద్రంలో ప్రియతముని దివ్య సన్నిధిలో 3 రోజులు గడపాలని మా తాడేపల్లిగూడెం కేంద్రం నుండి 65 మందిమి అక్టోబరు 23న బెంగళూరు చేరి అక్కడనుండి భైరమంగళకు వెళ్ళామని తాడేపల్లిగూడెం బాబా సెంటర్ కార్యదర్శి డాక్టర్ వై. విజయసారథి ఒక లేఖలో తెలిపారు. మా అందరికీ భైరమంగళకు వెళ్ళడం ఇదే ప్రధమం భైరమంగళ విశిష్టత గురించి శ్రీ వెంకోబరావు వివరంగా చెప్పారు. ఇక్కడ క్రొత్తగా నిర్మించిన మల్టీపర్‌పస్ హాలులో బాబా భజనలు చేశాం.

భైరమంగళకు మా రాక తెలిసి అక్టోబరు 25న ఆదివారం ఉ॥ 10 గంటలకు బెంగుళూరు నుండి స్థానిక బాబా ప్రేమికులు ప్రేమికులు భైరమంగళ వచ్చారు. వారందరితో కల్సి ప్రత్యేక సత్సంగ్ కార్యక్రమం ఆనాడు మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించాం. శ్రీమతి ఫ్రీనీ నాలావాలా, శ్రీమతి గీతా జయరాం తదితరులు పాల్గొన్నారు. ఆ మర్నాడు అక్టోబర్ 26న బెంగుళూరులో గల నారాయణ మహారాజ్ వారి సమాధిని సందర్శించి తాడేపల్లిగూడేనికి తిరుగు ప్రయాణమయ్యాం.

ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా జొరాష్టర్ నుండి మెహెర్ ప్రియతముని వరకు ఏడుగురి అవతార పురుషులకు 7 మందిరాలు ఇక్కడవున్నాయి. ఇవిగాక పంచ సద్గురువులకు ఐదు మందిరాలు వేరుగా వున్నాయి. అలాగే, సాధారణంగా భక్తులు భగవంతునికి మందిర నిర్మాణం చేస్తారు. కాని ఇక్కడ దైవీ మానవుడే ఇక్కడ తన అవతారాలకు స్వయంగా మందిరాలు నిర్మించారు.

ఇవీ భైరమంగళ ప్రత్యేకతలుగా చెప్పుకోవాలి.

బాబా 1939లో ఈ ఆశ్రమం స్థాపించినప్పటినుండి ఆశ్రమ రక్షణలో వున్న శ్రీ వెంకోబారావు నేటికి తన 88వ ఏట కూడా ప్రతిరోజూ నిరంతరం బాబా నిర్మించిన ఈ మందిరాల ప్రాంగణంలో బాబా నామస్మరణతో కేంద్ర ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని కాపాడుతున్నారు. విచ్చేసే బాబా ప్రేమికులకు వెంకోబరావు దంపతులు ఆత్మీయ స్వాగతం పలుకుతున్నారు. వీలుచిక్కినప్పుడు ఓ బృందంగా పలు బాబా సెంటర్లనుండి భైరమంగళ సందర్శించాలనుకోవడం ఉభయకుశలోపరి.

## వివాహం

చి॥ల॥సౌ॥ లీలా మాధవి వివాహము చి॥ నాగ వెంకట రామకృష్ణతో చిత్తూరు జిల్లా, కాణిపాకం, శ్రీ విఘ్నేశ్వరస్వామివారి సన్నిధిలో 01.11.2009, ఆదివారం రాత్రి 8 గంటలకు జరుపుతున్నట్లు శ్రీమతి వంకాయల మహాలక్ష్మి, శ్రీ వంకాయల హరగోపాల్ దంపతులు ఆహ్వానం పంపారు.





# డెహ్రాడూన్‌లో 60వ నవజీవన వార్షికోత్సవం

**- డూన్ నుంచి శ్రీ పి.యస్.కె.శర్మ.**



బాబా ప్రేమికులకు అక్టోబరు నెల చాలా ప్రధానమైన మాసం. 2009 అక్టోబరు నాటికి బాబా గడిపిన నవజీవనం కార్యక్రమానికి సరిగ్గా 60 ఏళ్ళు నిండాయి. ఈ సందర్భంగా ఉత్తరాంచల్ రాష్ర్టంలో వున్న డెహ్రాడూన్‌లో 60వ నవజీవన వార్షికోత్సవం నాలుగు రోజులపాటు, అక్టోబరు 13,14,15,16 తేదీలలో ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ నాల్గు రోజుల కార్యక్రమంలో భాగంగా – మెదటి రెండు రోజులు అంటే, అక్టోబరు 13,14 తేదీలలో హరిద్వార్ నుండి డూన్‌కు సమీపంలోని మంజిల్ మాఫీ దాకా, 61 కి.మీ మెహెర్ నవజీవన పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్ర ఆసాంతం ఎంతో ఉత్సాహంగా నడిచింది. యువకులే కాదు, వృద్ధులు, మహిళలు సుమారు 200 మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బాబా నామజపం స్మరిస్తూ, సుమారు 2 కి.మీ పొడవున రెండు వరుసలలో బాబా ప్రేమికులు నామ జపం, నృత్యం చేస్తూ నగర సంకీర్తన చేశారు.

అంతక్రితం అక్టోబరు 10, 11 తేదీలలో నాగపూర్‌లో బాబా ప్రేమిక సహవాస్ రెండురోజులపాటు ఎంతో వైభవంగా జరిగింది. మేమయితే ఓ 8 మందిమి హైదరాబాద్ సెంటర్ నుంచి ముందుగా నాగపూర్ సహవాస్‌కి వెళ్ళి, అక్కడ్నించి డూన్‌లో ఏర్పాటుచేసిన నవజీవన పాదయాత్ర, సహవాస్ కార్యక్రమాలలో పాల్గొని అక్టోబరు 18 నాటికి భాగ్యనగరానికి 10 రోజుల తర్వాత తిరిగి వచ్చాం. నాగపూర్ సహవాస్ గురించి గతనెల సంచికలో తెలియజేశాం. కాబట్టి, ఈ సంచికలో నవజీవన పాదయాత్ర- డూన్ సహవాస్ విషయాలు తెలుగు పాఠకులందరికీ తెలియజేసే ప్రయత్నం చేస్తున్నాను. దయచేసి పరిశీలించండి...

హరిద్వార్, రుషికేష్, డెహ్రాడూన్ ఈ మూడూ త్రికోణాకారంలో వున్న ప్రాంతాలని చెప్పొచ్చు. హరిద్వార్ – డెహ్రాడూన్ జాతీయ రహదారిపై వున్నాయి. ఇది హెవీ వెహికిల్ ట్రాఫిక్ జోన్‌గా చెప్పుకోవాలి. ఇలాంటి రహదారిపై హరిద్వార్ నుంచి ఉదయం 7.30 కల్లా బాబా ప్రార్ధనలు చేసుకుని నామజపంతో పాదయాత్ర ప్రారంభించాం. అంతక్రితం రోజు రాత్రికే అంటే అక్టోబరు 12 నాటికల్లా హరిద్వార్‌లోని కాంచీ మఠానికి బాబా ప్రేమికులందరూ చేరుకున్నారు. ఆ రాత్రికి విశ్రాంతి తీసుకుని మర్నాటి ఉదయం పాదయాత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. పాదయాత్రకు అగ్రభాగాన అవతారుని చిత్రపటం బహు సుందరంగా నాలుగు చక్రాల బండిపై హరిద్వార్ దేవాలయాల సాంప్రదాయంలో అలంకరించారు. బాబా ప్రేమికులు రెండు వరసలలో, జాతీయ రహదారికి ఎడమవైపున నడుచుకుంటూ సుమారు రెండు కిలో మీటర్లు పొడవున కొనసాగింది.

ముందుగా హరిద్వార్ పురవీధుల గుండా మా పాదయాత్ర కొనసాగింది. ఈ ప్రాంతంలో మాకు ఎక్కువగా పలు మఠాలు, ఆశ్రమాలు, అంటే రమారమిన ఓ 100 పైగా కనిపించాయి. ఆయా ఆశ్రమాలలో వుంటున్న ఎందరో సాధువులు ఆవతారుని చిత్రపటానికి వినమ్రతతో తలలు వంచి నమస్కరించారు. మరెందరో అవతారుని చిత్రపటాన్ని దర్శించుకున్నారు. బాబా హరిద్వార్‌ని పలుమార్లు సందర్శించారు. మస్తులతో సాంగత్యం చేశారు. ఈ విషయం పాఠకులకు విదితమే.

హరిద్వార్ నగర పొలిమేర్ల దాటగానే ముందుగా **మోతిచూరు** అనే గ్రామం వచ్చింది. ఇక్కడి సమీపంలో చిన్న కొండపై బాబా తన కార్యక్రమాలు కొద్దిరోజులపాటు నిర్వహించారని స్థానిక బాబా ప్రేమికులు చెప్పారు. ఆ తర్వాత రాయీవాలా అనే గ్రామం వచ్చింది. ఇక ఇక్కడ్నుంచి దట్టమైన అడవి, ఘాట్ రోడ్డు మొదలయింది. దారి పొడవునా కోతులూ, వాటి ఆగడాలు చూడముచ్చటగా వుండింది. అంతేకాదు, ఈ దారిలో ప్రతి కిలో మీటరుకి ఓ మందిరం, లేదా ఓ సాధువుగారికి చెందిన మఠం, కాదూకూడదంటే ఓ ఆశ్రమం కనిపించాయి. మనవారికి దైవ భక్తి మెండు అనొచ్చు కదా. మాకు దారి పొడుగూతా తినడానికి, త్రాగడానికి అలసట ఎరక్కుండా వుండటానికి, వాలంటీర్లు అందించిన సేవలు మరువలేనిది. ఈ యాత్రలో పాల్గొన్నవారిలో సీనియర్ సిటిజన్ల సంఖ్య తక్కువగా ఏమీ లేదు మరి.

అలా మధ్యాహ్నం భోజన సమయానికి **ఛిద్రేవాలా** అనే గ్రామం చేరాం. ఇక్కడే కొద్దిసేపు విశ్రాంతి, లంచ్ ఏర్పాట్లు చేశారు. సాయంత్రానికి **లత్తాపూర్** గ్రామానికి చేరాం. ఇక్కడవున్న సిక్కు గురుద్వారాలో రాత్రి డిన్నర్, బస ఏర్పాటు చేశారు. స్థానిక గురుద్వారా పెద్దలు అవతారునికి స్వాగతం పలికారు. వారు పెద్ద పెద్ద ఫ్లెక్సీ బ్యానర్ల తో





# డూన్ విశిష్టత

మెహెర్‌బాబా బాగా ఇష్టపడిన ప్రదేశం డెహ్రాడూన్

డెహ్రాడూన్‌లో మెహెర్‌బాబా ప్రప్రథమంగా 1953 మార్చి 23లో, తిరిగి 1953 నవంబరు ఒకటో తేదీన రెండు దఫాలు బహిరంగ దర్శనం ఇచ్చారు.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి విడివడి, కొత్తగా ఏర్పాటయిన ఉత్తరాంచల్ రాష్ట్ర రాజధాని కేంద్రం – డెహ్రాడూన్.

మెహెరుడు తన ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా 1941–53 అంటే 12 సంవత్సరాల నడుమ డెహ్రాడూన్ పరిసర ప్రాంతాలలో పలు ప్రదేశాలు ఆయన సందర్శించారు. అనేకమంది మస్తులతో మెహెర్‌బాబా తన ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు.

డెహ్రాడూన్‌లోనే మెహెర్‌బాబా Highest of the High ‘ఉన్నతోన్నతుడను’ అని ప్రకటించారు.

1953 ఆగస్టు 13న మెహెర్‌బాబా డెహ్రాడూన్‌లోనే పర్వద్విగార్ ప్రార్ధనను తన ప్రేమికులకు అందజేసారు.

మెహెర్‌బాబా స్వయంగా వ్రాసిన భగవద్వచనం (God speaks) డెహ్రాడూన్ నుంచే శ్రీకారం చుట్టారు. అలాగే విలియం డాంకిన్ వ్రాసిన Wayfarers- ‘మస్తులు’ ‘భగవదోన్మత్తులు’– గ్రంథం, నౌషర్వాన్ సంపాదకత్వంలో ప్రస్తుతం వెలువడుతున్న గ్లో–ఇంటర్నేషనల్ ఆంగ్ల పత్రిక కూడా డూన్ నుంచి తొలిసారిగా ప్రారంభించడం జరిగింది.

నా బృందావనం– డెహ్రాడూన్– అని బాబా ఈ ప్రాంతాన్ని కొనియాడారు.

బాబాకు స్వాగతం పలికారు. తెలుగువారిక్కడ గంటసేపు పైగా భజనలు చేశారు. ఇంతలో భోజనం రెడీ అయింది. కడుపారా తిని ఆ రాత్రి మంచి నిద్ర తీశాం. శరీరాన్ని కొద్దిగా కష్టపెట్టామేమో, వెంటనే నిద్రలోకి జారుకున్నారందరూ..

ఆ మర్నాడుదయం సిక్కు పెద్దలే బ్రేక్ ఫాస్ట్ కూడా ఏర్పాటు చేశారు. అదికాస్తా కానించి, తిరిగి పాదయాత్రను బాబా నామ స్మరణతో ప్రారంభించాం.మాకు ఈ దారిలో బిర్లా పవర్ సొల్యూషన్స్, అక్వా వాటర్ సొల్యూషన్స్, గ్లోబల్ షిప్పింగ్ ఇనిస్టిట్యూట్, ఫన్ వ్యాలీ – పిక్‌నిక్ స్పాట్, ఉత్తరాంచల్ మెడికల్ అండ్ డెంటల్ రీసర్చ్ ఇనిస్టిట్యూట్...ఇలా పలు సంస్థలు కనిపించాయి. ఆ తర్వాత సోయాంగ్ నది వచ్చింది. ఆ నది దాటాక **డోయీవాలా** అనే గ్రామం వచ్చింది. ఇక్కడున్న శక్తి

మందిరంలో లంచ్, విరామం, విశ్రాంతి ఏర్పాట్లు చేశారు. ఆ తర్వాత తిరిగి పాదయాత్ర ప్రారంభం కాగా.. **మార్వాల గ్రామం, హర్వాలా గ్రామం, మొహకం పూర్‌ల** మీదుగా **మెహెర్ మాఫీకి** అక్టోబరు 14,సాయంత్రం 6 గంటలకల్లా చేరుకున్నాం. అంతకుముందు, **హర్వాలా** గ్రామానికి బాబా ప్రేమికులు డాన్ –ఇ – స్టీవెన్స్ మాకు ఎదురువచ్చి స్వాగతం పలికారు. అందరినీ ప్రేమగా పలకరించారు. మెహెర్ మాఫీలో మేం 8 మందిమి హైదరాబాద్ నుండి వెళ్ళినవాళ్ళం శ్రీ శత్రుఘ్న కుమార్ ఇంట బసచేశాం. శత్రుఘ్నకుమార్‌గారి భార్య శ్రీమతి సుభద్ర, వారి కుటుంబీకులు కలిశారు. పాదయాత్రలో డూన్, హైదరాబాదీయలతో పాటు, హమీర్‌పూర్, రూర్కీ, ముంబాయి, శ్రీకాకుళం, ఖమ్మం, రాజమండ్రి, చంద్రాపూర్, నాగపూర్, బెంగళూరు, ఒరిస్సా, ఇలా పలు కేంద్రాలనుండి బాబా ప్రేమికులు హాజరయ్యారు. ఈ యాత్రలో అవసరమైతే వినియోగించేలా వైద్యులు, మందుల కిట్‌లతో సహా తగిన ఏర్పాట్లు చేశారు. అయితే, బాబా దయవల్ల పెద్దగా ఎవరికీ ఆ అవసరం పడలేదు. రెండు రోజులలో 61 కిలో మీటర్ల పాదయాత్ర అవలీలగా, అవతారుని ప్రేమలో ప్రేమమయ వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## డూన్ సహవాస్

సహవాస్ కార్యక్రమానికి ముందుగా బాబావారి సప్తవర్ణ పతాకాన్ని మెహెరాబాద్ నుంచి విచ్చేసిన శ్రీమతి తారాబాయ్ ఆవిష్కరించారు. తారాబాయ్ తన 10 సంవత్సరాల వయస్సులో బాబా సన్నిధికి వచ్చానని చెప్పారు. తన తండ్రి బాబా తొలిసారిగా ఆరంగాం వచ్చినప్పుడు, బాబాకు ఆతిధ్యం ఇచ్చినవైనం ఆమె వివరించారు. తాను దాదాపు అప్పట్నించి అవతారుడుని తన ఇలవేల్పుగా, సాక్షాత్తూ అవతారమూర్తిగా, భగవంతునిగా ఆరాదిస్తూ గడుపుతున్నానని తారాబాయ్ చెప్పారు. బాబావారితో బ్లూ బస్ పర్యటనలు కూడా చేసిన తారాబాయి, అవతారుని సన్నిధిలో తన అనుభవాలు చెప్పుకొస్తే ఎన్ని గంటలైనా సరిపోవని స్థానిక బాబా ప్రేమికులన్నారు.

శ్రీ శాలిగ్రాం శర్మ ప్రసంగిస్తూ, బాబా నవజీవనంలో తన దివ్యత్వాన్ని వదలి, సాధారణ జీవితం గడిపారన్నారు. మనకి సమస్తం అందించడానికే, బాబా తన సర్వస్వం త్యాగం చేశారని అన్నారు.

ఈ సమావేశంలో పాశ్చాత్య బాబా ప్రేమికుడు శ్రీ డాన్ ఇ స్టీవెన్స్ మాట్లాడుతూ, బాబాకు ప్రధానంగా మూడు సెంటర్లంటే ఇష్టమన్నారు. 1. హమీర్‌పూర్, 2. డెహ్రాడూన్ 3. హైదరాబాద్ అని అన్నారు. డెహ్రాడూన్, హైదరాబాద్‌లలో బాబా నవజీవనం గడిపిన విషయాలను ఆయన వివరించారు.





**CYCLE OF CYCLES.**

బాబా కఠోర ఏకాంతవాసం చేశారు. ఈ యగం అంతమవబోతోంది. రాబోయే యుగాలకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయడం కోసం బాబా కఠోర వుపవాసాలున్నారని డాన్ వివరించారు. డాన్ బాబాతో చాలా సన్నిహితంగా వున్నారని బాబా ప్రేమికులకు తెలుసు. బాబా రాసిన భగవద్వచనం – గాడ్ స్పీక్స్ గ్రంధం తొలి చిత్తు ప్రతిని బాబా డాన్‌కు చూపించారు. ఈ విషయాలపై కూడా బాబా డాన్‌తో పలు సందర్భాలలో చర్చించారు. బాబా తాను పర్యటించిన హిందూ దేవాలయాలు, ముస్లిం దర్గాలు, క్రైస్తవ చర్చిలు, ఇతరత్రా అన్నింటినీ ఒక పర్యాయం పర్యటించమని డాన్‌ని ఆదేశించారు. తాను ఆ మాదిరిగానే ఆయా ప్రదేశాలు పర్యటించానని, , ఆయా ప్రదేశాలలో ఆలాంటప్పుడు, అవతారునితో కల్సి తిరిగిన అనుభూతి కల్గిందని వివరించారు. మనస్సు వున్నంత వరకూ సంస్కారాలు తప్పవనీ బాబా చెప్పినట్లు డాన్ ఉటంకించారు. మనస్సు నాశనం – **మనోనాశ్ కార్యక్రమాన్ని** బాబా హైదరాబాద్‌లోని ఖోజాగూడాలో నిర్వహించారని ఆయన గుర్తుచేశారు.

ఈ సహవాస్‌కు ప్రత్యేకంగా లండన్ నుంచి శ్రీమతి **RENATE MORTIZ** వచ్చారు. బాబా ప్రేమికులను చూడాలని, వారితో మాట్లాడాలనే తాను వచ్చానని అమె అన్నారు. నా స్నేహితులు, బాబా ప్రేమికులు కొందరు బాబావారి నవజీవనం గురించి, మెహెర్‌బాబా వారి పుస్తకం ఇచ్చారు. అది చదివాక ఇండియా రావాలని బాబా ప్రేమికులను కలవాలని మరింత గాఢమైన కోర్కెతో తాను ఈ కార్యక్రమాలకు హాజరవుతున్నానీ అన్నారు. ఇక్కడ్నుంచి హైదరాబాద్‌లోని ఖోజాగూడా కొండక్కూడా వెళ్ళనున్నానని ఈ రచయితతో ఆమె చెప్పారు. **మరో మాటకు సమాధానంగా – మా దేశీయులు మెటీరియలిస్టులు. ఇక్కడివారు ప్రేమగా, స్నేహంగా, ఆత్మీయంగా వుంటారు. ఇంతటి ఆత్మీయత మాకు ఎంతో కరవేనని అన్నారామె.**

ఈ సమావేశంలో స్థానిక బాబా ప్రేమికులు కల్నల్ ఛండేల్, శ్రీ లలిత్ (రూర్కీ), శ్రీ బి. రామక్రిష్ణయ్య, డా. నరేంద్ర ప్రసాద్, శ్రీ యస్.ఆర్. శర్మ, తదితరులు ప్రసంగించారు.

## భజనలు – నాటికలు

హైదరాబాద్, డూన్, అమరావతి, ముంబాయి, హమీర్‌పూర్, తదితర బాబా సెంటర్ల నుండి విచ్చేసిన ప్రేమికులు హృద్యంగా భజన గీతాలాపనలు చేశారు. కాగా, ముంబాయి సెంటర్‌వారు ప్రదర్శించిన మెహెర్‌బాబా నవజీవనం నాటిక చాలా చక్కగా వుంది. మెహెర్ నోష్ అవతార్ మెహెర్‌బాబాగా చక్కని ఆహార్యంతో అద్భుతంగా నటించారు. డూన్ సహవాస్‌కి ఈ నాటిక ప్రత్యేకం అని, కార్యక్రమాలన్నింటికీ హైలైట్ అని ఆహుతులు అభివర్ణించారు.



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చురీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ

***(గత సంచిక తరువాయి)***

1,7,14,28,56 కూడండి.

ఈ ఐదు అంకెలు కూడితే 106 వస్తుంది.

మరి 1,0,6, కూడితే ఏడు వస్తుంది.

ఆరు, వొకటీ వో ప్రక్క, ఒక్కటీ ఒక ప్రక్క. ఆసక్తికరంగా లేదూ.

ఈ లెక్క విశేషమేమిటో బాబా వారు చెప్పలేదు కానీ, ఈ లెక్కని మరచిపోకండి.

జాగ్రత్తగా గుర్తుంచుకోండి అని మాత్రం హితవు పలికారు.

డిసెంబరు 25వ తేదీ ఏసు ప్రభువు పుట్టినరోజు.

కొత్త మస్తు వేడుకలు ఘనంగా జరిగాయి మెహెరాబాద్‌లో. ఆనాటి కార్యక్రమాలకి అందరూ ఆహ్వానితులే. వచ్చిన వారికి మెహెరాబాద్ ఆశ్రమం అంతా చూపించారు.

మధ్యాహ్నం 12 గంటలకి బాబావారి పాదాలని మండలివారు, పిల్లలు భక్తితో కడిగారు. ఆ నీళ్ళని తలపై చల్లుకొని పులకించారు. ఆనాటి ఏసు అవతారుని సేవించామో లేదో కానీ ఈనాటి అవతారుని సేవించి తరించ గలుగుతున్నామని పొంగిపోయారు.

సాయంత్రం ఐదు గంటలకి సంగీత విభావరి మొదలయింది. ఐదు గంటలసేపు సంగీత ఝురిలో మెహెరాబాద్ ఆశ్రమం తేలిపోయింది.

మర్నాడు, అంటే క్రిస్టమస్ తర్వాతి రోజున బాబావారు ఎప్పటిలానే సృష్టి విచిత్రాలని పిల్లలకి చెప్పారు.

సంఖ్యామానంలో ఏడు విశిష్టతని వివరించారు.

ప్రపంచాలు, ఆకాశాలు, సూర్యుడు, చంద్రుడు, భూమికలు, స్వరాలు ఇవి అన్నీ ఏడేసి చొప్పున వున్నాయన్నారు. అంటే సృష్టిలో ఏడు ప్రపంచాలు వున్నాయి.

పరిణామక్రమంలో ఏర్పడిన గ్రహాలు, అలానే ఏడు ఆకాశాలు, ఏడుగురు సూర్యులు, చంద్రులు ఏడుగురు వున్నారు. భూమికలు ఏడు వున్నాయి. స్వరాలు కూడా ఏడే.



మెహెర్‌బాబా నవంబరు 2009

వ్యావర్తన దశలోనే స్వర్గాలున్నాయి.

ఇలా ఇవన్నీ ఏడేసి చొప్పున ఎందుకున్నాయి.

ఇవే కాదు, సంస్కారాలు కూడా ఏడు రంగుల్లో వున్నాయి.

ఎందువల్లన అంటే, సృష్ట్యాదిలో శక్తి, ఘనపదార్ధంతో ఢీకొంది.

ఏడు ఖండాలు ఏర్పడ్డాయి. అప్పుడే సప్తవర్ణాలు కన్పించాయి.

ప్రతి మనిషిలోనూ అనంత విశ్వం వుంది. ఇది అతిశయోక్తికాదు.

తల తీసుకోండి. రెండు కళ్ళు, రెండు చెవులు, రెండు నాసికా రంధ్రాలు, ఒక నోరు వెరసి మొత్తం ఏడున్నాయి.

అలానే శరీరంలో కూడా ఏడు భాగాలున్నాయి. రెండు చేతులు, రెండు కాళ్ళు, శరీరం ముందుభాగం, శరీరం వెనక భాగం, మొండం- మొత్తం ఏడు భాగాలున్నాయి.

ప్రపంచాలు గురించి గతంలో చెప్పాను.

మీకు గుర్తుంది కదా.

ప్రపంచాలు ఎన్నో. ఎన్నెన్నో.. అవి అన్నీ చల్లబడ్డాయి. ఇవి వొక్కక్కటీ చల్ల పరచటానికి ఎన్నో యుగాలు పట్టింది.

అవి ఎన్ని యుగాలో వుహించగలరా?

మనిషి సంగతి తీసుకోండి. 84 లక్షల సార్లు జన్మిస్తారు. 84 లక్షల సార్లు మరణిస్తాడు. బ్రహ్మైక్యం సిద్ధించి, ఏడవ భూమికలోకి అడుగు పెట్టాక, ఈ జనన మరణాలు, ఈ వరసిద్ధి అంతా ఏదో తృటిలో జరిగాయనుకొంటాడు.

మరి మీదృష్టిలో ఈ ప్రక్రియకు కొన్ని వందల వేల సంవత్సరాలు పట్టి వుండాలి.

నా అనుభవం చెప్పనా?

ఈ జనన మరణాలు, భగవదనుభూతి అంతా చిటికెలో జరిగాయి.

ఇది నా స్వానుభవం.

ఏ మాత్రం టైమ్ పట్టలేదు.

మరోమాట. అంతా బుర్రలోనుంచే వస్తుంది.

బుర్రలో ఏడు ప్రపంచాలున్నాయని చెప్పానుగా. అందుకని తలపై జుట్టు తీయించండి. మంగలిని పిలిచి గుండు గీయించండి, అంటూ బాబా వో మనిషి తలని బొమ్మగా గీశారు.

ఈ తలపై జుట్టు తీసి, గుండు చేసే మంగలి ఎవరో తెలుసా? అని ప్రశ్నించారు.

తామే సమాధానమిచ్చారు. ఈ మంగలి మరెవరో కాదు. మహా ప్రళయం అని పేర్కొన్నారు.

మహాప్రళయం సంభవించగానే, భగవంతుని శిరస్సుపై జుట్టు అంతా పోతుంది. గుండు గీసినట్లవుతుంది.

ఈ విశ్వాంతరాళమే భగవంతునిపై జుట్టు. ఎందుకంటే భగవంతుని శిరస్సునుంచి విశ్వ ప్రపంచం పుట్టుకు వచ్చిందంటారు. అందువల్లనే ప్రపంచాలను తల వెంట్రుకలతో పోల్చాను. మీ శిరస్సు భగవంతుడని అని అనుకొంటే, మీ జుట్టు ప్రపంచాలుగా అభివర్ణించవచ్చని బాబావారు పిల్లలకి చెప్పారు.

ఆ సాయంత్రం అంటే డిసెంబరు 26వ తేదీ సాయింత్రం బాబా ఇంకో సృష్టి రహస్యం చెప్తుంటే పెద్ద ఆదీ బాబా సమాధి గది కిటికీ దగ్గర కూర్చొన్నాడు. శ్రద్ధగా బాబా మాటల్ని ఆలకిస్తున్నాడు.

ఇంతలో కె.జె. దస్తూర్ వచ్చి ప్రక్కకు జరగమని భుజం తట్టాడు.

ఇది నా సీటు. నేను కూర్చోవాలి, జరుగు అన్నాడు. దస్తూర్ ధోరణి పెద్ద ఆదీకి నచ్చలేదు సరికదా చిరాకు వేసింది. నన్ను గదమాయిస్తున్నాడేమిటి అనిపించి "ఏం ఇదేమన్నా నువ్వు డబ్బు పెట్టికొన్న జాగానా," అని నిలదీశాడు. దస్తూర్‌కి కోపం వచ్చింది. వీరిద్దరి ఘర్షణ గమనించిన బాబా, ఆదీని తప్పుపట్టారు. దస్తూర్ కాళ్ళకి దణ్ణం పెట్టి, తప్పయిపోయిందని లెంపలు వేసుకో అన్నారు. ఆదీ కోపంతో వూగిపోయాడు. అవమానభారంతో కృంగిపోయాడు. అయినాసరే బాబా ఆజ్ఞని శిరసావహించాడు. దస్తూర్ కాళ్ళకి నమస్కరించి తప్పయిపోయింది, క్షమించమని ప్రాధేయపడ్డాడు. ఈ సంఘటన జరిగిన కాసేపటికి దస్తూర్ వెళ్ళిపోయాడు. ఆదీ అక్కడే కూర్చున్నాడు. బాధ పడవద్దని బాబా అతనికి చెప్పారు. దస్తూర్‌ని క్షమించమని ఎందుకు ఆదేశించిందీ చెప్పగానే పెద్ద ఆదీ నోరెత్తలేదు. తల దించుకొన్నాడు.

నిన్ను నేను ఏదో అవమానించాను అనుకోకు. నువ్వు ధూళిగా మారాలి. నిన్ను ధూళిగా మారుద్దామనే నీకు చివాట్లు పెట్టాను. కూర్చొన్నచోటు నుంచి





కదలాల్సివచ్చిందని బాధపడకు. అయ్యో నా సీటు, ఇవ్వాల్సివచ్చిందేనని అనుకొన్నావేమో? నీవు పోగొట్టుకొన్నది ఏదీ లేదు? ఏదో పోయిందని నువ్వు అనుకొంటున్నది వుందే, అది నీకు జరిగిన మేలు. అదే నీకు కల్గిన లాభం. నష్టంవున్న చోటే లాభం వుంటుంది. నష్టం లేకపోతే లాభం రాదు. అహంకారం వదిలిపెట్టకపోతే ఆధ్యాత్మికంగా లాభపడలేరు, అని బాబా ఆదీకి విశదీకరించారు.

డిశంబరు 27వ తేదీన బాబా ఇంకో కొత్త విషయం చెప్పారు.

సృష్ట్యాదిలో ఏం జరిగిందీ తెలియజేశారు.

శక్తి, ఆకాశంతో ఢీ కొట్టినప్పుడు అగ్ని, నీరు, వాయువు, భూమి ఏర్పడ్డాయి. ఇవి ఒకదాని తర్వాత మరొకటి వెంట వెంటనే వచ్చాయి. శిలలు, లోహాలు, కూరాకులు, క్రిములు భూమికి సంబంధించినవి. చేపలు నీటికి చెందినవి. వాయువుతో పక్షులు, అగ్నితో జంతువులు, అన్ని భూతాలతో ముడిపడి మనిషి పుట్టుకు వచ్చాడు.

అగ్ని అంటే మెరుపు. ప్రతిచోట మెరుపు మెరిసింది. ఈ ధరణీదాతకం దాన్ని ఆవరించింది. ఈ మెరుపు వల్లనే జంతువుల్లో జీర్ణశక్తి బాగా పెరిగింది. జంతువులు తిండిపోతులు. కేవలం తినడానికే పుట్టాను అన్నట్లు తెగతింటాయి. బొంబాయి జంతు ప్రదర్శన శాలలలో ఏనుగు వుంది. ఈసారి అక్కడికి వెళ్లినప్పుడు తప్పకుండా దాన్ని చూడండి. అది ఎప్పుడూ ఏదో నములుతూనే కనిపిస్తుంది.

కూరాకుల ప్రపంచంలో పుట్టిన మొదటి పురుగు రంగు ఆకుపచ్చ రంగు. ఆఖరిన పుట్టినది యెండ్రకాయ. చెమ్మ మట్టిలో వుంటుంది. అంటే నీళ్ళలోకి కూడా పోతుంది. యెండ్రకాయ తర్వాత అందుకనే చేప పుట్టింది. చేప వుండేది నీళ్ళలోనే కదా. ఈ పరిణామ క్రమంలో ఆఖరిది కప్ప. మీకు తెలుసుగా. కప్ప నీళ్ళలో వుంటుంది. నీళ్ళ నుంచి బయటకి రావాలని చూస్తుంది. ఈ జీవ పరిణామక్రమంలో ఇదొక పెద్దమలుపు అనవచ్చు. కప్ప తర్వాత జలపక్షి వచ్చింది.

పక్షుల్లోకూడా కొన్ని నీళ్ళపై ఎగురుతుంటాయి. నీళ్ళ చుట్టూనే తిరుగుతుంటాయి.

ఎందుకో తెలుసా? చేప దశ తర్వాత వచ్చిన మొదటితరం పక్షులు ఇవి.

ఆ తర్వాత తరం పక్షులకి గాలి అంటే మక్కువ ఎక్కువ. అందుకే అవి ఎగురుతూ కన్పిస్తాయి. పక్షుల దశలో ఆఖరున వచ్చినది గిన్నె కోడి. ఇవి ఎగురుతాయి. నడుస్తాయి. పరుగెడతాయి.

దరిమిలా జంతువుల దశ మొదలైంది.

ఆస్ట్రేలియా, న్యూజిలెండ్ దేశాల్లో ఇప్పుడు ఎక్కువగా కనిపించే కంగారూలు పుట్టాయి.

ఇవే జంతు ప్రపంచంలో పుట్టిన మొదటి ప్రాణము.

జంతువుల పరిణామక్రమంలో ఆఖరున ఎవరు వచ్చారు.

మీ ఊహ కరక్టే !

కోతులు పుట్టాయి. కోతి తర్వాత మనిషి పుట్టాడు.

సాధక ఆశ్రమంలో వో ఐదుగురు కఠిన ఏకాంతవాసం చేస్తున్న సంగతి పాఠకులకి గుర్తుంది కదూ.

మెహెర్బాన్‌పూర్, శంకర్‌నాథ్, గోపాలస్వామి, మనేకర్, గులాబ్‌షాలు బాబా ఆజ్ఞ ప్రకారం కేవలం పాలు తప్ప ఏమీ తీసుకోవటం లేదు.

సాధక ఆశ్రమం అంటే తెలుసుగా- బాబా వారి సమాధి గది ప్రక్కన కట్టిన గదులు.

ఇవి వాటికి బాబావారు పెట్టిన పేరు - సాధక ఆశ్రమం.

మరి వీరందరూ సాధకులే కదా.

డిసెంబరు 28వ తేదీ నాటికి వీరు ఏకాంతవాసం మొదలు పెట్టి 26 రోజులయింది.

ఆ వేళ ఎప్పటిలానే తెల్లవారింది. కానీ, గులాబ్‌షా గది తలుపుతెరచి వుంది.

అక్కడ అతడు ఏమయ్యాడు? ఎక్కడకి వెళ్ళాడు అని అందరూ కంగారు పడ్డారు.

గాలింపు మొదలయింది. కాసేపటికి వాళ్ళ కంగారు సర్దుమణిగింది.

ఎందుకో తెలుసా? గులాబ్‌షా కనబడ్డాడా అంటే కనబడలేదు. వీడికి ఏమీ కాలేదు. పారిపోయాడని రూఢి అవటంతో హమ్మయ్య, పోనీలే , అనుకొన్నారు అందరూ.

అయితే మిగిలిన సాధకులు, అదే మెహెర్బాన్‌పూర్, శంకరనాథ్, గోపాలస్వామి, మనేకర్‌లు ఈ గొడవను పట్టించుకోలేదు.

వాళ్ళు గది దాటి బయటకి వస్తే వొట్టు.

వాళ్ళు బాబా ఆజ్ఞ ప్రకారం తమ గదుల్లో ఏకాంతవాసం దీక్షలో వుండిపోయారు. బయట అంతా గులాబ్‌షా గురించి పెద్ద చర్చనీయాంశం అయినా వీళ్ళకి చీమకుట్టినట్లుగా కూడా అనిపించలేదు.

ఇంతకూ గులాబ్‌షా ఎందుకు పారిపోయినట్లో!

ఇతగాడు స్వేచ్ఛాజీవి.

కాళ్ళు చేతులు కట్టిపడేసినట్లు ఏకాంతవాసంలో కూర్చోమంటే భరించలేకపోయాడు. బాబా కోసమని కొన్నిరోజులు వోపికపట్టాడు. ఇహ లాభం లేదు అనిపించగానే గప్‌చుప్‌గా జారుకున్నాడు.

బాబా పరీక్షలకి అందరూ తట్టుకోలేరు సుమా!





ఆవేళ, అంటే డిసెంబరు 28వ తేదీన, బాబా దర్శనానికి వో మహిళ వచ్చింది.

"బాబా! నువ్వు సర్వజ్ఞుడవు, సర్వసాక్షివి, అని ప్రస్తుతించింది.

బాబా వారు చిరునవ్వు నవ్వారు. ఆమెని ఆశీర్వదించారు.

సర్వజ్ఞత అంటే ఏమిటో మండలివారికీ, ఆశ్రమం పిల్లలకి వివరించారు.

జ్ఞానం నాలుగు రకాలు.

ప్రాపంచిక జ్ఞానం, భూమికల జ్ఞానం, ఏడవ భూమికలో స్వీయ జ్ఞానం. అవతారునికే పరిమితమైన సర్వజ్ఞత- ఇలా జ్ఞానం నాలుగురకాలు.

అవతార పురుషుడు, సద్గురువులు నిర్వహించే కార్యక్రమం, విశ్వ కార్యక్రమం ముల్లోకాలకీ సంబంధించింది. ముల్లోకాలనీ ప్రభావితం చేస్తుంది అని బాబా వారు పేర్కొన్నారు.

భూమికలు, స్వర్గాల గురించీ చెప్పారు. భూమికలు పదివున్నట్లుగా స్వర్గాలు కూడా పదివున్నాయని అన్నారు.

మన శరీరంలోనే సప్త భూమికలకి, సప్త స్వర్గాలకి సమతుల్యమైన భాగాలున్నాయన్నారు.

భూమికలు శరీరం ముందు భాగాలతో, స్వర్గాలు శరీరం వైనుకవైపు భాగాలతో సమతుల్యమైనవని అన్నారు. యోగులు స్వర్గ మార్గాన వెళ్ళి భగవదనుభూతిని సంపాందించాలనుకొంటారన్నారు.

ఇది చాలా కష్టమైన మార్గం. దూరం కూడా ఎక్కువ.

భూమికల మార్గం ఇలా కాదు. అది రైలు ప్రయాణం వంటిది. సాఫీగా జరుగుతుంది, అవతారుని కృప వుంటే.

| | | |
|---|---|---|
| మొదటి భూమిక | - | నాభి. |
| రెండవ భూమిక | - | ఛాతి ఎడవ వైపు |
| మూడవ భూమిక | - | ఛాతి కుడి వైపు |
| నాల్గవ భూమిక | - | గొంతు క్రింద |
| ఐదవ భూమిక | - | గొంతు మధ్య |
| ఆరవ భూమిక | - | భ్రుకుటి (రెండు కళ్ళ మధ్య భాగం - త్రినేత్రం) |
| ఏడవ భూమిక | - | శిరస్సు పైన లేదా కపాలం మధ్యగా |

ఈ ప్రకారం శరీరం ముందు భాగాలతో సప్త భూమికలు సమతుల్యమైతే, సప్తస్వర్గాలు శరీరం వెనుక భాగాన వున్నాయి. ***(సశేషం)***

# అమరతిథికి సిద్ధమౌతున్న ఆంధ్రా రెస్ట్‌హౌస్

మెహెరాబాద్‌లో అవతారుని అమరతిథి వేడుకలకు హాజరయ్యే బాబా ప్రేమికుల సౌకర్యార్థం ఆంధ్రుల రెస్ట్‌హౌస్ అనేక చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం రెస్ట్‌హౌస్ మొదటి అంతస్థు పనులకు 2009 సెప్టెంబరు 28, విజయదశమినాడు శ్రీకారం చుట్టిన పనులన్నీ ఈ డిశంబరు ఆఖరి వారానికల్లా పూర్తికానున్నాయి. తద్వారా, ఆంధ్రా రెస్ట్‌హౌస్‌లో సుమారు 110 మందికి పైగా భోజన వసతి సౌకర్యాలు కల్పించనున్నామని కార్యదర్శి వై.యస్.రావు ఒక ప్రకటనలో తెలిపారు. క్రింది అంతస్థులో జీవిత సభ్యులకు, వృద్ధులకు, పై అంతస్థులో ఇతరులకు కేటాయించనున్నామని ఆయన అన్నారు.

ఆరోగ్య పరిస్థితి, వయస్సునుబట్టి అదనపు చార్జీలతో మంచాలు కేటాయించనున్నామని ఆయన అన్నారు. మొత్తం 30 మందికి మాత్రమే మంచాలు కేటాయించగలమని, మిగిలినవారందరికీ **సి, డి -** హాస్టలు మాదిరి బస ఏర్పాట్లు చేయనున్నామన్నారు.

29.1.2010 నుండి 1.02.2010 వరకు బస ఏర్పాట్లకై ఒక్కొక్కనికి రూ.100/- చొప్పున, భోజనం, టిఫిన్, కాఫీ/టీలకై రోజుకి రూ.75/- చొప్పున వసూలు చేయవలెనని ప్రతిపాదించినట్లు శ్రీ రావ్ చెప్పారు. ఇదికాకుండా విచ్చేసే బాబా ప్రేమికుల సౌకర్యార్థం కూడా ఒక క్యాంటీన్ రెస్ట్‌హౌస్ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

**ఆసక్తిగలవారు తమ వివరాలు ఈ క్రింది అడ్రస్సుకు తక్షణం పంపవల్సింది.**

శ్రీ వై.యస్.రావ్, సెక్రటరి, ఆంధ్రా రెస్ట్‌హౌస్, బి.యస్.ఎన్.ఎల్. టవర్ ఎదురుగా, మెహెరాబాద్ - 414006 (అరంగాం), అహ్మద్‌నగర్ జిల్లా, మహారాష్ట్ర
ఫోన్- 09848111671, 09011751910 సంప్రదించగలరు.

## మనవి

ఆంధ్రా రెస్ట్‌హౌసు ప్రత్యేకంగా బాబా ప్రేమికులందరి కోసం ఏర్పాటుచేసుకున్నాం. భవిష్యత్తులో మెహెరాబాద్‌లో ఏర్పడే భక్తుల రద్దీ దృష్ట్యా, ఇలాంటి విశ్రాంతి భవనాల అవసరం ఇంకా ఎంతైనా వుంటుంది. ఆంధ్రా రెస్టుహౌసు నిర్మాణపు పనులలో ప్రతి తెలుగు బాబా ప్రేమికుడూ స్వఛ్ఛందంగా భాగస్వాములు కావాలని శ్రీ వై.యస్.రావ్ విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం ప్రేమికులు వారి వారి శక్త్యానుసారం ఎంత మొత్తమైనా స్వీకరించగలమన్నారు. రెస్టుహౌసుకు జీవిత సభ్యత్వం రూ.25 వేలుగా నిర్ణయించామన్నారు.

ఈ రెస్టుహౌసు బాబా ప్రేమికులందరిది. పెద్ద మనస్సుతో అందరూ సహకరించాలని మనవి చేస్తున్నామన్నారు.





# ఖోజాగూడా



హైదరాబాద్ నగర శివార్లలో గల ఖోజాగూడా మనోనాశ్- కొండపై బాబా ప్రేమిక సహవాస్ అక్టోబర్ 18 ఆదివారం ఉదయం 9 గంటల నుంచి జరిగింది. బాబా నవజీవన కార్యక్రమంలో భాగంగా మనోనాశ్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని ఖోజాగూడా ప్రాంతంలో 1951 అక్టోబరు 15 నుండి 24 దాకా సుమారు 10 రోజులు గడిపిన విషయం పాఠకులకు తెలుసు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గత కొన్నేళ్ళుగా ప్రతి ఏడాది ఇక్కడ హైదరాబాద్ సెంటర్ సత్సంగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఇక్కడ అవతారుడు నవజీవనం గడిపిన చిన్న గుహలాంటి ప్రాంతం వుంది. ప్రతి బాబా ప్రేమికుడు వీలైతే తప్పక దర్శించి తీరాలి. ఎత్తైన కొండప్పై, ఓ ప్రక్కన దర్గా, మరో ప్రక్కన వేణుగోపాలస్వామి ఆలయం ఉన్నాయి. రెండేళ్ళక్రితం వరకూ ఈ ప్రాంతం నిర్మానుష్యంగా వుండేది పచ్చని పంట పొలాలు, మంచి నీటిచెరువులతో నిండి వుండింది. కానీ, ప్రస్తుతం, కొండ చుట్టూతా పలు కాంక్రీటు నిర్మాణాలు, ఆకాశ హార్మ్యాలు వచ్చేసాయి. జన సంచారం బాగా పెరిగింది. ఐనప్పటికీ బాబా వారి మనోనాశ్ గుహ ప్రాంగణం మాత్రం ఎంతో చల్లగా, ప్రశాంతంగా, ఆధ్యాత్మిక చింతనాపరులకు చక్కని ఆలవాలంగా దర్శనమిస్తోంది. దేశ విదేశాలనుండి బాబా ప్రేమికులు హైదరాబాద్‌కు ఎవరు వచ్చినా ముందుగా ఖోజాగూడాలోని బాబావారి గుహ చూడ్డానికై వెళ్తున్నారు. మీరూ ఈ దఫా హైదరాబాద్ విచ్చేసినప్పుడు మనోనాశ్ కొండను సందర్శించగలరు.

# బందరులో బాబా సహవాస్

**(పమ్మి సూర్య కామేశ్వర శర్మ, మచిలీపట్నం నుంచి)**

మచిలీపట్నం సెంటర్ 55 వ వార్షికోత్సవం, స్థానిక బాబా సెంటర్‌కు చెందిన ఆడిటోరియం రజతోత్సవం సందర్భంగా బాబావారి సహవాస్‌ను పెద్ద ఎత్తున అక్టోబరు 31, నవంబరు 1వ తేదీలలోల రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. సుమారు 1500 మంది బాబా ప్రేమికులు హాజరయ్యారు. ట్రస్టీ సభ్యులు శ్రీ శ్రీధర్ కేల్కర్ బాబావారి సప్తపర్ణ పతాకాన్ని ఎగురవేసి కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభించారు. బందరులో బాబా సెంటరు 1954 ఫిబ్రవరి 22న ప్రారంభించారు. 1964 ఫిబ్రవరి 28న బాబావారి కార్యదర్శి మరియు శిష్యుడైన శ్రీ ఆదీ.కె. ఇరానీ సెంటర్ సొంత భవనాల నిర్మాణం కోసం శంఖుస్థాపన చేశారు. నాటి నుంచి క్రమంగా సెంటర్ నిర్మాణపు పనులతో బాబా భక్తుల అందరి సహకారంతో పలు విధాల అభివృద్ధి పరచగల్గామని స్థానిక సెంటర్ కార్యదర్శి శ్రీ జి. రామచంద్రరావు తన నివేదికలో అన్నారు. సహవాస్‌కు విచ్చేసిన అతిధులను శ్రీ టి. మెహెర్‌బాబా ఆహుతులకు పరిచయం చేశారు. సెంటర్ అధ్యక్షులు, శ్రీ సి. నాగేశ్వరరావు తన తొలి పలుకులలో బందరు సెంటరు నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మెహెరాబాద్ నుంచి విచ్చేసిన బాబా ప్రేమికులు శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరీ, శ్రీ రమేష్ జంగ్లీ, శ్రీ ప్రతాప్ ఆహిర్, శ్రీ తిరుపతి శర్మ, శ్రీ ఎ.వి. రాఘవులు, శ్రీ బి. రామక్రిష్ణయ్య , శ్రీమతి వేణా కుమారి, శ్రీ ప్రసన్న కుమార్, శ్రీ తోట నాగేశ్వరరావు, శ్రీమతి సుబ్బలక్ష్మి, శ్రీమతి మాధవీ లత, శ్రీ యస్.వి. సత్యనారాయణ, శ్రీ హంసపాల్, శ్రీమతి రాజ్ మెహెర్‌నాథ్, శ్రీ టోనిక్స్ క్రిస్, (అమెరికా), శ్రీ ప్రభు ప్రోఫాలి, తదితరులు అవతారుని సందేశాలపై చక్కగా ప్రసంగించారు. శ్రీ ప్రసాద్ రాజు, ఆంధ్రా సెంటరు కార్యక్రమాలను వివరించారు. అవతార్ మెహెర్‌బాబా కార్పస్ ఫండు కోసం బాబా ప్రేమికులు ఉదారంగా విరాళాలు పంపాలని కోరారు.

సాంస్కృతిక కార్యక్రమాలు – ఈ రెండు రోజుల సహవాస్ కార్యక్రమాలలో భాగంగా శ్రీ తాతా బాబు, సూర్య బృందం, (శ్రీకాకుళం సెంటర్), మల్లిక్ బృందం, జి. యస్. ప్రకాశరావు భజన బృందం, శ్రీ ప్రతాప్ ఆహిర్, హైదరాబాద్ ప్రేమికులు – శ్రీ గోపీ బృందం, శ్రీమతి పద్మావతి, శ్రీమతి క్రిష్ణవేణి, చక్కగా అవతారుని భజన గీతాలు ఆలాపించారు. శ్రీమతి సుబ్బలక్ష్మిగారి ఆధ్వర్యంలో రెండు గంటలపాటు ఆసక్తికరంగా చిన్న పిల్లలకు బాబావారి విషయాలపై క్విజ్ నిర్వహించారు. బాబావారి బందరు





పర్యటన విశేషాలపై శ్రీ సి.వై. చింతామణి రూపొందించిన నృత్యరూపకం – మెహెర్ దివ్యా గమనం – శ్రీకాకుళం సెంటర్– విద్యా విహార్ బాలబాలికలు చక్కగా ప్రదర్శించారు. అలాగే చెన్నై శ్రీనిబాబు ఆధ్వర్యంలో సప్త వర్ణ పతాక నృత్యం, కుమారి మెహెర్ ఆశ్చర్య, ప్రీతి, మెహెర్ నిధి, హవీష్, స్నేహిత, బేబి చరిష్మలు ప్రదర్శించిన నృత్య రూపకాలు హృద్యంగా వున్నాయి. రుబియా జీవిత చరిత్రపై రూపొందించిన నాటకం – అందమే ఆనందం – రాజమండ్రి నారాయణరావు గారి ఆధ్వర్యంలో ప్రదర్శించారు. నవజీవన ఘట్టాలను వివరిస్తూ విశాఖపట్నం సెంటర్‌వారు– ప్రేమతో బిక్ష–నాటిక ప్రదర్శించారు. ముందుగా, అవతార్ మెహెర్‌బాబా ఆగమనంతో బందరు భూమి పునీతం అనే గ్రంధాన్ని శ్రీ బి. రామక్రిష్ణయ్య సంకలనం చేయగా శ్రీ మెహెర్‌నాద్ కల్చూరీ అవిష్కరించి ప్రేమికులందరికీ అందజేశారు.

నవంబరు ఒకటో తేదీన ఉదయం 7 నుండి 8.30 దాకా బాబావారిని పల్లకీలో కూర్చోబెట్టి, సన్నాయి వాద్యాలతో మంగళకరంగా, కడురమ్యమైన నగర సంకీర్తన నిర్వహించారు. మచిలీపట్నం బాబా సెంటర్‌వారు చక్కని ఆతిధ్యం అందిస్తారని అనాదిగా పేరిన్నికగన్నారు. ఆ పేరు ప్రఖ్యాతులు ఈ యువతరంలోని వారి అనుయాయులు, అదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారని, సహవాస్‌కు హాజరయిన బాబా ప్రేమికులు పలువురు పేర్కొనడంలో సత్యదూరం ఏమీ లేదు. ❋

# జీవిత సభ్యత్వం

12.09.2008 నాడు హైదరాబాద్, గగన్‌మహల్ బ్రాంచిలో ఆంధ్రా బ్యాంక్ ఫ్లెక్సి ఫిక్స్‌డ్ డిపాజిట్ స్కీంలో (ABFRI/01/2060004) జమ అయిన మొత్తం నగదు రూ.2,53,528/– నుండి రూ. 2,45,000/– మేరకు విత్‌డ్రాచేసి, ఆ నగదును అదే బ్యాంకులో 400 రోజులకై 10% వడ్డీ చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ 12.09.2008న చేయడమైంది. ఈ వివరాలు మరింత వివరంగా సెప్టెంబర్ 2008 సంచికలో ప్రచురించడమైంది. దయచేసి పరిశీలించగలరు.

పైన పేర్కొన్న ఫిక్స్‌డ్ డిపాజిట్ నగదు 16.10.2009 నాటికి రూ. 2,72,9848/– లతో మెచ్యూరయింది. కాగా, ఆ నగదుకు అదనంగా, ప్రస్తుతం బ్యాంక్ ఖాతాలోని జీవిత సభ్యత్వ నిల్వలతో కలిపి మొత్తం రూ. 3.50 లక్షల వరకూ విత్‌డ్రా చేసి, ఆ నగదును పోస్ట్ ఆఫీస్ Monthly RD + fixed deposit పథకంలో డిపాజిట్ చేయాలని ప్రతిపాదించడమైంది.

జీవిత సభ్యులు, వార్షిక సభ్యత్వం వసూళ్ళు, జమా – ఖర్చులపై ఎప్పటిలా 2010 జనవరి సంచికలో సవివరంగా ప్రచురించగలం. **– ఎడిటర్.**

## కొత్త పుస్తకం
# న మే భక్తః ప్రణశ్యతి

**అ**వతారుని సేవలో తరించి, ధన్యులైన ఓ 50 మంది విశేష జీవనరేఖాచిత్రాలతో కూడిన ఒక చక్కని గ్రంధాన్ని **న మే భక్తః ప్రణశ్యతి** పేరిట – మెహెర్‌బాబా మాసపత్రిక రూపొందించింది. పలువురు బాబా ప్రేమికులు అవతారుని సన్నిధిలో గడిపిన సమాచారాన్ని నేరుగా వారితో ఇంటర్వ్యూలు జరిపి గత ఐదారేళ్ళుగా మెహెర్‌బాబా మాసపత్రికలో దాదాపు ప్రతినెలా ప్రచురిస్తూ వచ్చిన సంగతి బాబా ప్రేమికులందరికీ తెలుసు.

భవిష్యత్తులో పలువురి బాబా ప్రేమికులకు, ముఖ్యంగా యువతరానికి ఉపయోగపడేలా ఆ ఇంటర్వ్యూలన్నింటినీ గ్రంధస్తం చేయడమైంది.

సుమారు 400 పుటలతో త్వరలో మీ ముందుకు రానున్న ఈ గ్రంధాన్ని ప్రతి ఒక్కరూ ప్రేమతో ఆస్వాదించగలరు.

ఈ పుస్తకంలో ప్రచురించనున్న బాబా ప్రేమికులు –

1. అలోబాజీ 2 ఏరుచ్ జెస్సావాలా 3. ఏడిద సత్తిరాజు 4. ఏ.ఎస్.జగనాథ్ 5. ఏ. నారాయణరావ్, నిజామాబాద్, 6. కళ్యాణ రావు జోషి 7. కాలేమామ 8. కాకాబారియా 9. కైకోబాద్ 10. గుస్తాద్‌జీ 11. గులాబ్ దాస్ పాంచాల్ 12. డా॥ గోహెర్ ఆర్.ఇరానీ 13. చంద్రమౌళీశ్వరరావు జి.వి.జి.కె. 14. డా॥ జి.ఎస్.ఎన్.మూర్తి 15. తారాబాయ్ 16. తాడిమేటి సూర్యకుటుంబ శాస్త్రి 17. డాక్టర్ తోట ధనపతిరావు నాయుడు 18. దశిక ప్రసాదరావు 19. డా॥ దిగంబర్ గాడేకర్ 20. డా॥ దౌలత్‌సింగ్ 21. నోరి ప్రభాకరమ్మ 22. నోరి సీతమ్మ 23. పంకరాజ్ 24. పద్మనాభరావు తోట, 25. పుకార్‌జీ 26 ఫ్రాన్సిస్ బ్రాబజాన్ 27. ఫ్రీనీ నాలావాలా 28. బందెల బాపిరాజు 29. బాలగోపాల భాస్కరరాజు 30. భావూ కల్చూరి 31. రమా కల్చూరీ 32. బిల్ లీపేజి 33. మంత్రవాది శ్రీరామమూర్తి 34. మల్లాది సుశీలాకృష్ణ, 35 మల్లాది గోపాలకృష్ణమూర్తి 36. మాజేటి రామ్మోహనరావ్ 37. మాణిక్యాలరావు 38. మలకపల్లి రామక్రిష్ణ శర్మ (ఎమ్.ఆర్.కె.శర్మ) 39. మెహెర్ మాయ 40 డాక్టర్ ఆర్పీ రావ్ 41. డా॥ రామచంద్రన్ 42. రమణయ్య ఎన్.వి. 43. రాఘవులు ఎ.వి.44. రోషన్ కేరేవాలా 45. శ్యామ్ కేరేవాలా 46. లక్ష్మీకాంత్ థాడే 47. శతృఘ్న కుమార్ 48. సమీర్ దిల్‌జాన్ 49. సుభద్ర 50. ధాకే ఫాల్కర్. యమ్.ఆర్.

**కాగా, ఈ పుస్తకం విడుదల గురించిన వివరాలు డిశంబరు 2009 సంచికలో పరిశీలించగలరు.**

**– మల్లాది కృష్ణానంద్, సంపాదకులు**





# జన్మదినోత్సవాలు

హైదరాబాద్ సెంటర్ బాబావారి జన్మదినోత్సవ వేడుకలు 2009 నవంబరు 15 నుండి ప్రారంభిస్తున్నారు. ఈ కార్యక్రమాలు ఫిబ్రవరి 25 దాకా– 116 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు శ్రీ నోరి సూర్యనారాయణ ప్రకటించారు.

ప్రతిరోజూ బాబావారి సత్సంగ్ కార్యక్రమాలు నవంబరు 15 నుండి ఒకొక్కరి గృహంలో నిర్వహిస్తామని, జంటనగరాలలో ఆయా ప్రాంతాలలో గల బాబా ప్రేమికులు ముందుగా తమకు అనుకూలమైన తేదీలను నిర్ణయించుకుని 1) శ్రీ అప్పారావ్, 2) శ్రీ నోరి సూర్యనారాయణ 3) పి. రాజేంద్ర మెహెర్‌లలో ఎవరిలోనైనా ఒకరికి తెలియజేయవల్సిందిగా కోరారు.

ఐతే వారంలో ప్రతి శనివారం సాయంత్రం 6 నుండి 8 గంటల దాకా కోఠి బాబా సెంటర్‌లోను, ఆదివారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 దాకా రోడ్ నెం.36, జూబ్లిహిల్సులో బాబా సత్సంగ్ కార్యక్రమాలు ఉంటాయి కాబట్టి బాబా ప్రేమికులు సోమవారం నుండి శుక్రవారంలోగా తమ ఇళ్ళలో ఏదేని ఒకరోజు బాబా జన్మదిన వేడుకల సత్సంగ్ ఏర్పాటు చేసుకోవాలని శ్రీ నోరి కోరారు. . కాగా, ఈ కార్యక్రమాలకు తమ చుట్టుప్రక్కల గల వారందరినీ ఆహ్వానిస్తూ చాలా నిరాడంబరంగా ఏర్పాటు చేయాలని, బాబా ప్రసాదాల ఏర్పాటుకు ఎలాంటి ఆర్భాటాలకు తావుఇవ్వని రీతిలో కేవలం చాక్లెట్స్ పంచిపెట్టడంతో సరిపుచ్చాలని శ్రీ నోరి సూర్యనారాయణ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. కాగా, హైదరాబాద్‌లో ప్రతి ఏడాది నాంపల్లి ప్రాంతంలో జనవరి నెలలో ప్రారంభించే ఎగ్జిబిషన్‌లో మెహెర్‌బాబా స్టాలు జనవరి 7నుండి ఏర్పాటు చేస్తున్నట్లు వీలున్నవారందరూ తప్పక బాబా స్టాలుని సందర్శించాలని శ్రీ నోరి కోరారు.

# ట్రస్టు బస్సులు

మెహెర్‌బాబా ట్రస్టు వారి బస్సులు మెహెరాబాద్‌లోని సి, డి.హాస్టల్స్, మెహెర్ పిలిగ్రిమ్స్ సెంటర్, ఆంధ్రా రెస్టెహౌస్, పిలిగ్రిమ్ రిట్రీట్‌ల నుండి ఉ.9.30 ప్రాంతంలో తీసుకువెళ్ళి లంచ్ టైం కల్లా తిరిగి వారి వారి బస/ వసతి ప్రాంతాల్లో వదిలిపెడుతుంది. బాబా ప్రేమికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోగలరు.

ప్రతి మంగళవారం, గురువారం, ఆదివారం మెహెర్‌బాబా నివాసమున్న మెహెరాజాద్‌కు,

ప్రతి సోమవారం శుక్రవారం, శనివారం మెహెర్‌బాబా ట్రస్టు ఆఫీసు, అహ్మద్‌నగర్‌కు తీసుకుని వెళ్ళి తీసుకువస్తుంది.

# ముటుకూరు సెంటర్




ముటుకూరు గ్రామంలో చేపట్టిన బాబావారి సెంటర్ నిర్మాణం దాదాపు పూర్తయింది. ప్రారంభోత్సవానికి తుది మెరుగులు దిద్దుకుంటున్న ఈ సెంటర్ భవన నిర్మాణ పనులకు బాబా ప్రేమికులు ప్రేమతో విరాళాలు పంపి సహకరించాలని కార్య నిర్వాహకులు శ్రీ యాగంటి సుబ్బయ్య, ముటుకూరు, దుర్గిమండలం గుంటూరు జిల్లా - 522 612, కోరుతున్నారు. విరాళాలను బ్యాంకు ఆన్‌లైన్ అకౌంట్ నెం.11546058867 ద్వారా పంపవచ్చని ఆయన తెలిపారు.

# శాత్తు ముత్తై
# (అంతిమ సంస్కారం)

బాబాప్రేమికులు, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లా, శ్రీ బండవరం రంగనాథ స్వామిగారి స్వీయ కవితల సంపుటియే శాత్తుముత్తై (అంత్మ సంస్కారం). సాహితీ సంరక్షణ సమితి, మంచిర్యాల తరఫున ప్రచురించారు. ఈ చిన్ని పుస్తకంలో శ్రీ బండవరం రాసిన సుమారు 50 కవితలు హృద్యంగా ఉన్నాయి. ఎండాకాలం, సంక్రాతి, ఉగాది- ఉన్మాది, ఇలా అనేక గేయాలు చక్కగా వున్నాయి. చివరిగా, తన **అభీష్టము- వీలూనామా** తుది పలుకులుగా, తన మనస్సులోని మాటలకి అక్షరరూపం ఇచ్చారు. తన మరణానంతరం ప్రభుత్వ ఆసుపత్రి వర్గాలకు శరీరదానం, నేత్రదానం గురించి, మంచిర్యాలలో ఏర్పాటుచేసిన వృద్ధాశ్రమం గురించి ఈ పుస్తకంలో క్లుప్తంగా ప్రస్తావించారు. తానుగా కీలక పాత్ర పోషిస్తూ - సామాజిక, సాహిత్య, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భాగంగా **సాహితీ సంరక్షణ సమితి** 2008 అక్టోబరు 24న ఏర్పాటు వివరాలు క్లుప్తంగా ఈ పుస్తకంలో పేర్కొన్నారు. **ఈ పుస్తకం వెల- అమూల్యమే.** కావల్సిన వారు శ్రీ బండవరం రంగనాథస్వామి ఇ.నెం.7-141, మెహెర్ మది, వాటర్ టాంక్, మెయిన్‌రోడ్, మంచిర్యాల-504 208 ఆదిలాబాద్‌జిల్లా, ఫోన్- 9849922141, 08736-252970 సంప్రదించగలరు.





# మెహెర్‌బాబా సమాధి



మెహెరాబాద్‌లోని చిన్ని కొండపై మనం ప్రస్తుతం సమాధిని దర్శించుకుంటున్న ప్రాంతంలో **1927 జూన్‌లో** తొలుత ఒక తడికల గదిని నిర్మించారు. ఈ తడికల గదే ఆ తర్వాతర్వాత నేడు మనం చూస్తున్న బాబావారి సమాధిగా రూపాంతరం చెందింది. ఆ విషయాలను పరిశీలిస్తే నాలుగువైపులా తడికలుతో ఒక వైపున తలుపు, తూర్పు వైపు కిటికీ, పై భాగాన టిన్ రేకులతో ఒక చిన్ని గదిలాగా- బాబా వారి కోసం ఆనాడు ప్రత్యేకంగా నిర్మించారు. తిరిగి ఆ మరుసటి నెల, అంటే జూలైలో నాలుగు అడుగుల వెడల్పు, ఆరు అడుగుల లోతుగల పెద్ద గొయ్యిని బాబా ఆదేశాల మేరకు తవ్వారు. ఆ తర్వాత ఈ గొయ్యి లోపలి గోడలు నుంచి మట్టి పెళ్ళలు రాలకుండా వుండేలా సున్నం- ఇసుకతో నునుపు చేశారు.

గొయ్యి గది అనీ, ఇంగ్లీషులోనయితే పిట్ రూమ్ అనీ బాబా మండలి సభ్యులు ఈ గదిని పిలిచేవారు. ఆ తర్వాత తడికల గదికి పై భాగాన వేసిన రేకులు తొలగించి, మట్టి- కంకరతో నున్నగా అలికారు. గదికి నాలుగు వైపుల నుంచి బాగా కాంతి వచ్చేలా- కిటికీలు ఏర్పాటు చేశారు.

ఆ పిదప ఈ గొయ్యి గదిని బాబా 1927 ఆగస్టు 16 నుంచి తన ఏకాంతవాసం కోసం వినియోగించడం ప్రారంభించారు. ఈ గొయ్యిగదికి దగ్గర్లోనే డిశంబరు నెలలో మరో చిన్నసైజు 5 తాత్కాలిక గదుల నిర్మాణం, మండలివారు ధ్యానం చేసుకునేందుకు వీలుగా నిర్మించారు. **ఇదిలా వుంటే 1934 మే నెలలో పెద్దఎత్తున గాలిదుమారం వచ్చి**, గొయ్యి గదిపైన వున్న రేకులు- తడికలు అన్నీ చెల్లా చెదురయ్యాయి. మరమ్మత్తులు పెద్దఎత్తున చేయించవల్సి వచ్చింది.

1938లో బాబా ఏమన్నారంటే ఈ గొయ్యిగదికి పై భాగాన డోమ్ ఆకృతి నిర్మించమని ఆదేశించారు. భవిష్యత్తులో ఇది బాబా వారి సమాధిగా రూపాంతరం చెందనుందని బాబా మండలి వారందరికీ అప్పుడు తెలుసొచ్చింది. అప్పటిదాకా మండలి వారికీ ఈ గొయ్యిగది ఎందుకు నిర్మింపజేశారో అర్ధమయ్యింది కాదు.

తడికల స్థానంలో నల్ల గ్రానైట్ రాళ్ళతో గట్టి నిర్మాణం చేపట్టాలని బాబా తన మండలిని ఆదేశించారు. దిగువ మెహెరాబాద్ రోడ్డు క్రాస్ చేసి బాబా సమాధి వున్న ఎగువ మెహెరాబాద్‌కు వెళ్ళే దారిలో ప్రస్తుతం వున్న రైల్వేక్రాసింగ్ దగ్గర పూర్వం రోజుల్లో గ్రానైట్ స్టోన్‌తో నిర్మించిన ఒక పోస్టాఫీసు భవనం వుండేది. బ్రిటీషువారి పాలనాకాలంలో నిర్మితమైన ఈ రైల్వేలైను, రైలు మార్గానికి దగ్గరగా వున్న పోస్టాఫీసు భవనాన్ని - తగిన రక్షణ కోసం కూల్చివేయాలని కోరారు. ఆ మాదిరిగా పోస్టాఫీస్ భవనం కూల్చివేయడమైంది. కాగా, పోస్టాఫీసు భవనంలో వుపయోగించిన నల్ల గ్రానైట్ రాళ్ళను గొయ్యిగది నిర్మాణంలో వుపయోగించమని బాబా కోరారు గ్రానైట్లుతో గది నిర్మాణం పూర్తయ్యాక ఈ గదిపైభాగాన- నాలుగు మతాలకు చెందిన చిహ్నాలు- నాలుగు మూలల్లో ఏర్పాటు చేశారు.

క్రైస్తవుల- శిలువ, హిందువుల- దేవాలయం

మస్లింల- మసీదు, జొరాస్ట్రియన్‌లు- అగ్ని చిహ్నాలు ఏర్పాటు చేశారు.

ఆ తర్వాత కొద్ది కాలానికి స్విస్ చిత్రకారిణి హెలెన్ డామ్ (HELEN DAHM) చక్కని తైలవర్ణ కుడ్య చిత్రాలు చిత్రీకరించారు. ఈ నిర్మాణపు పనులన్నీ కూడా 1938 నవంబరు నాటికి పూర్తయ్యాయి. అనంతరం, సమాధికి వెలుపల ప్రధాన సింహద్వారానికి పైభాగాన సేవాధర్మంలో ప్రావీణ్యత 'Mastery in Seritude' అని బాబా రాయించారు.

1969 జనవరి 31 మధ్యాహ్నం 12.15 ని॥ ప్రాంతంలో బాబా భౌతిక దేహ త్యాగం మెహెరాజాద్‌లో చేశారు. అక్కడ్నుంచి మెహెరాబాద్‌లో ముందుగా నిర్మించుకున్న ఈ బాబా సమాధి ప్రాంగణానికి స్థానిక బూత్ ఆసుపత్రికి చెందిన ఒక ఆంబులెన్స్‌లో తీసుకొచ్చారు. ఆశ్చర్యమేమంటే, ఆ దరిమలా, ఆంబులెన్సు కూడా వినియోగం లేక మూలనపడింది. బాబావారినే ఆ ఆంబులెన్స్ ఆఖరిగా తీసుకొచ్చింది. దాంతో





ఆంబులెన్సులోని స్ట్రెచ్చర్‌ను ఆసుపత్రివర్గాలు బాబా ట్రస్టుకు అప్పగించి వేశారు.

ఈ స్ట్రెచర్‌ను ప్రస్తుతం బాబా ఏకాంతవాసం వున్న గదిలో బాబా ప్రేమికుల దర్శనార్థం వుంచారు. స్ట్రెచర్ చుట్టూతా గట్టి అద్దాల పేటిక తయారుచేయించారు.

బాబా భౌతిక దేహాన్ని 1969 జనవరి 31న వదిలినా, ఫిబ్రవరి 7 దాకా ఏడురోజులపాటు సమాధిలో, రాత్రింపగళ్ళు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి, ఎంతో దూరప్రాంతాలనుండి వచ్చే బాబా భక్తులు, ప్రేమికుల దర్శనార్థం వుంచారు.

ప్రతి ఏడాది బాబా శరీరం వదిలిన జనవరి 31న మెహెరాబాద్‌లో అవతారుని అమరతిధి నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం 41వ అవతారుని అమరతిధి జరుపుకుంటున్నారు. జనవరి 31న మధ్యాహ్నం 12 గంటల నుండి 12.15 దాకా బాబా సమాధి ఎదుట మౌనంగా అవతారుడిని స్మరిస్తారు. మెహెరాబాద్ దాకా వెళ్ళలేని వారు స్థానికంగా వారెక్కడుంటే ఆ ప్రాంతంలో గల బాబా సెంటర్‌కు వెళ్ళి ఆ కొద్ది క్షణాలు మౌనంగా అవతారుడిని స్మరిస్తారు.

## వరత భాధిత ప్రాంతీయులకు హార్థిక సహాయం

ఇటీవల అక్టోబరు నెలలో కర్నూలు - మహబూబ్‌నగర్, తదితర జిల్లాలలో భారీగా కురిసిన వానలు- వరదల కారణంగా పెద్దఎత్తున ఈ జిల్లాలలోని ప్రజానీకం నష్టపోయారన్న సంగతి పాఠకులకు తెలుసు. సేవాధర్మం ప్రావీణ్యత- Mastery in Servitude బాబా సందేశాన్ని అనుసరించి హైదరాబాద్ సెంటర్ తక్షణం స్పందించి బాధితులను ఆదుకునేప్రయత్నం తమ వంతుగా చేశింది. కర్నూలు- మహబూబ్‌నగర్ జిల్లాలో హైదరాబాద్ సెంటర్ కార్యదర్శి శ్రీ పి. రాజేంద్ర మెహెర్ నేతృత్వంలో ఒక బృందం బాబా ప్రేమికులనుండి నగదు వస్తు రూపేణా వసూలు చేసి, గ్రామాలలో పంపిణిచేశారు. మనం అందించే సహాయం చాలా తక్కువే కావచ్చు.

మన సహాయం అందుకున్న కొద్దిమంది బాధితుల జీవితాలలో గణనీయమైన వెలుగురేఖలు ప్రసరించగలవన్న నమ్మకం మా గత అనుభవాలు తెలియజేస్తున్నాయని స్థానిక బాబా సెంటర్ కార్యదర్శి శ్రీ రాజేంద్రమెహెర్ తెలిపారు.

## వివాహం

చి॥ల॥సౌ॥ సరిత వివాహము చి॥ శ్రీనివాస్‌తో పద్మనాయక కళ్యాణ మండపము సిద్దిపేట రోడ్, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలో 05.11.2009, గురువారం ఉ. 9.17 ని.లకు జరుపుతున్నట్లు శ్రీమతి గుండ అంజమ్మ, శ్రీ గుండ రాజేశం గుప్త దంపతులు ఆహ్వానం పంపారు.

*(గత సంచిక తరువాయి)*

# బాటసారులు

**స**తారాలో నున్నప్పుడు చాచా ఎక్కువ మాటలాడువాడు కాదు. చాలా సేపు దినమునందెక్కువకాలము - వికారంగా కాళ్ళు ముడుచుకొని కూర్చొనును. లేక మోకాళ్ళు వక్షమువరకు ముడుచుకుని ఒకటి గాని, రెండూగాని మోచేతులను మోకాలుమీదనో తొడమీదనో పెట్టుకొని కూరుచుండును. అతని తల మామూలుగా ముందుకు కొంచెము వంగియుండును. అప్పుడు దాడీ కలిగిన అతని గడ్డము ఇంచు మించు ఉరముమీద పడును. ఎప్పుడూ రైలులో నిద్రపోవుచున్న మనిషి ఊగునట్లు అతని తల క్రిందకు పైకి ఊగుచుండును. అతని నేత్రములు మామూలుగా అర్ధనిమీలితములై యుండును. వృద్ధుల కండ్లలో తరచుగా కానబడునట్లు ఇతని కండ్లలో నల్లగుడ్డుచుట్టూ ఒక తెల్లని రేఖ ఉండును. పఠానుల కసాధారణమైన చిన్న శరీరముతో విరాజిల్లు అతని ముఖము మాత్రము కోలగా నుండును. ఏదో ఒక వింతయయిన అందమయిన స్వప్నములో నున్నట్లు- కండ్లు తెరచి యున్నను అతని ముఖముమీద భావము ద్యోతకమగుచుండును. అతని బొమ్మ చూచినచో, నెమ్మదిగలిగిన ఈ నిరాడంబర దృశ్యమే కనుపించును. అతడు మిక్కిలి మితభాషి. నిద్దురలో మాటలాడునట్లు ముద్దగా అస్పష్టముగా శబ్దములు పలుకుచుండును. "రా, రా" "వెళ్ళిపో. వెళ్ళిపో" అని చా, చా (టీ , టీ) అనిగాని. "లేదు, లేదు" అనిగాని అనుచుండును. ఇంతకన్న ఎక్కువగా మాటలాడుట అరుదు.

అతనియొక్క అశుభ్రత, స్నానముచేయ నిరాకరించుట, పరిశుద్ధమైన బట్టలు కట్టుకొనుటకు అయిష్టత, అతని పడక పరిసరములు శుభ్రముగా నుంచుట కంగీకరింపకుండుట ఇత్యాదిగుణముల గురించి ఇదివరకే చాలా చెప్పబడినది. దేహమును గూర్చి, దాని సంబంధమైన పనులనుగూర్చి అతడు గమనించునట్లే లేదు. క్రొత్తగా జన్మించిన శిశువువలె వుండును. కాని శిశువుకు విలక్షణముగా, చాచా తనకు భోజనము పెట్టకపోయినా, ఏమీ పట్టించుకొనడు. నిద్రపోవలయునని గాని, తన శరీరమునకు ఉష్ణత కలుగుచున్నదనిగాని, చలి వేయుచున్నదనిగాని, తడిసిపోవు చున్నదనిగాని, ఎండిపోడిగా నున్నదనిగాని ఏమీ గమనించడు.

జూలై ప్రథమ వారాంతమున చాచాతో తన పని ముగిసినదని బాబా తెలియపరచిరి. జూలై 10వ తేదీన బైదుల్ చాచాతో తిరిగి అజ్మీరుకు బయలుదేరెను. అజ్మీరు స్టేషన్ రాగానే హఠాత్తుగా చాచా అంతులేని ఆనందమును ప్రకటించెను. స్వయముగా బండిదిగి ప్లాట్‌ఫారం మీద చరచరా నడచి స్టేషను బయటకు వెళ్ళి వెంటనే ఒక టాంగాలో ఎక్కి కూర్చొనెను. బైదుల్‌కూడా తన పని సులభమయినదని సంతోషించుచూ అతనితో ఎక్కెను.





ఇద్దరూ చాచా ఉండెడి గదికి బయలుదేరిరి.

తన గదిని చేరగానే చాచా వెనకఉండిన తన స్థానమునుండి వచ్చి క్రిందకు దిగమని ఎన్ని విధముల ప్రార్థించినను పెడచెవిని బెట్టెను. టాంగా తోలేవాడు అరగంటచూచిన తరువాత తన గుఱ్ఱమునకు దాణా, నీరు పెట్టుకొను సమయమయినదని, ఎంత చెప్పిననూ చాచా బండి దిగనందున గుఱ్ఱమును విప్పి బండి కాడిని క్రింద పెట్టెను. అప్పటికిని చాచా బండిలోనే అట్లేయుండుట జూచి బైదుల్ నెమ్మదిగా ఆ కాడిని పైకి ఎత్తి క్రమంగా భూమియొక్క ఆకర్షణశక్తివల్ల చాచా క్రిందికి జారునట్లు చెసెను.

బాబా వద్దకు (సతారాకు) చాచా తీసుకువెళ్ళబడినట్లు సాధారణముగా ఎవరికీ తెలియదు. ఇప్పుడు తెలిసికొని అజ్మీరు ప్రజలు వాళ్ళ చాచా తిరిగి తమ వూరికి వచ్చెవని చాలా ఆనందించిరి. చాచా లేనికాలమునందు ప్రతి సాయంకాలము చాచా గదికి వచ్చి ఏడ్చుచూ కూర్చొనుచుండెనని బైదుల్‌కి చెప్పిరి.

చివరికి ఈ గొప్ప మజ్జుబ్ మరల అజ్మీరుకు వచ్చెను. ఖ్వాజా సాహెబ్ దర్గావద్దనున్న కశ్మలముతో నిండిన ఆ వింత గదిలో లోగడ జరిగినట్లు, బాబా చాచాతో సాంగత్యము కొరకు అతనిని పిలిపించియో, లేక ఆయనే అక్కడికి వచ్చియో చాచాను కలుసుకొనవచ్చునని ఎవరయిన అనుకొనగలరు.

షమ్స్- తబ్రిజ్ నుండి మస్తులకు వర్తించు ఒక వాక్యమును జ్ఞాపకమునకు తెచ్చుకొనుచూ అది ఘనమైన ఈ మజ్జుబ్‌కు సరిపోవునని భావించుచూ చాచా చరితమును ముగింతును."భాగవతుడు శిథిలములగు రాళ్ళలో ఒక వెలలేని రత్నము."

## (రెండవ అధ్యాయం సమాప్తం)

## బాటసారులు-మూడవ అధ్యాయము-పిచ్చివారి ఆశ్రమము

(1936 ఆగస్టు నుండి 1940 సెప్టెంబరు వరకు)

రాహూరిలో మెహెర్‌బాబా తన జీవిత స్వరవల్లరియందలి ఒక క్రొత్త ఉద్యమమునకు ప్రధమశబ్దములను పలికించిరి. మెహెర్‌బాద్ పాఠశాలనడుపుటలో శక్తివంతము జయప్రదము అయిన కార్యములు సాధించిన తరువాత 1930తో ప్రారంభమయిన దశాబ్దములో కొన్ని సంవత్సరములు పాశ్చాత్య ప్రపంచముతో ప్రధమంగా కొన్ని సంబంధములు ఏర్పరచుకొన్నతరువాత, 1936 సంవత్సరము నుండి పిచ్చివారియొక్కయు భగవదున్మత్తుల యొక్కయు సేవలో నిమగ్నులైరి.

*(సశేషం)*

# జూబ్లీహిల్సు సెంటర్

## 23వ వార్షికోత్సవం



1986 నవంబరు 14న సరిగ్గా 23 ఏళ్ళ క్రితం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్సు, రోడ్డు నంబరు 36లో బాబా మండలి సభ్యులు అలోబాజీ జూబ్లీ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నవంబరు 14న ఉదయం 9 గంటల నుండి 5 గంటల దాకా వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆంధ్రా సెంటర్ అధ్యక్షులు శ్రీ బి. రామక్రిష్ణయ్య, శ్రీ ప్రసాద రాజు, శ్రీ శ్రీనివాస రెడ్డి, శ్రీ మంత్రవాది శ్రీరామమూర్తి, శ్రీ వీరారెడ్డి, శ్రీ బి. క్రిష్ణయ్య, తదితరులు మెహెరుని సందేశాలపై ప్రసంగించారు. స్థానిక సెంటర్ కార్యదర్శి శ్రీ పి. రాజేంద్రమెహెర్ సెంటర్ కార్య కలాపాలపై నివేదిక సమర్పించారు. శ్రీ బి. క్రిష్ణయ్య సంకలనం చేసిన మెగా డైరీ విడుదలచేసారు. శ్రీమతి శివ నాగేశ్వరి రచించి, ప్రచురించిన బాబావారి పాటల పుస్తకాన్ని డా. వెంకటస్వామి నాయుడు విడుదల చేశారు. కుమారి మెహెర్ నిధి, ప్రణయ్, చేసిన నృత్యరూపకాలు సభికులను ఆకర్షించాయి. మహా భారతంలోని ఓ పౌరాణికాంశం ఆధారంగా **భక్తి- ప్రేమ** అనే నాటికను హృద్యంగా ప్రదర్శించారు. ఈ నాటికలో శ్రీ ప్రసాద రాజు, శ్రీ పి.యస్.కె.శర్మ, శ్రీ వినయ్, శ్రీ బి. రామక్రిష్ణయ్య, శ్రీ ఫణినాధ్ పాల్గొన్నారు.

గోపీ బృందం పాడిన గజల్సు పలువుర్ని ఆకట్టుకున్నాయి. హైదరాబాద్ చుట్టుప్రక్కల గల పలు పట్టణాలు గ్రామాలనుంచి అనేకమంది బాబా ప్రేమికులు ఈనాటి కార్యక్రమానికి హాజరయ్యారు.

మెహెర్‌బాబా 1951 మే – అక్టోబర్ నెలలో హైదరాబాద్‌లో ముఖ్యంగా జూబ్లీహిల్సు ప్రాంతంలో బస చేశారు. ఇక్కడకి దగ్గర్లోని ఖోజాగూడాలో మనోనాశ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మెహెరుని పాదస్పర్శతో పునీతమైన ప్రాంతంలోనే నేడు జూబ్లీసెంటర్ ఏర్పాటు యాదృచ్ఛికం ఏమాత్రం కాదంటారు స్థానిక బాబా ప్రేమికులు.





# జీవిత సభ్యత్వం

## 2009 ఆగస్టు – సెప్టెంబర్ నెలలో పంపిన వారి వివరాలు

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | నవంబరు 09 | శ్రీ చరణ్, హైదరాబాద్ | రు. 1000.00 |
| 2. | నవంబరు 09 | విజయశేఖర రెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ | రు. 600.00 |
| 3. | నవంబరు 09 | ఎన్.ఎస్.మూర్తి, విశాఖపట్నం | రు. 1000.00 |
| 4. | నవంబరు 09 | మాదవరపు ఆనందకుమార్, సికింద్రాబాద్ | రు. 750.00 |
| 5. | నవంబరు 09 | మద్దుల సుబ్రమణ్యం, రాజమండ్రి | రు. 1000.00 |
| 6. | నవంబరు 09 | మట్లే శ్రీమన్నారాయణ, రాజమండ్రి | రు. 1000.00 |
| 7. | నవంబరు 09 | ఎ. రవి కుమార్, శ్రీకాళహస్తి, చిత్తూరు | రు. 1000.00 |
| 8. | నవంబరు 09 | ఆనుమోలు లక్ష్మీప్రకాశ్, విజయవాడ | రు. 500.00 |
| 9. | నవంబరు 09 | ఐ.జె.శ్రీనివాస్‌బాబా, హనుమకొండ | రు. 500.00 |
| | | **మొత్తం** | **రు. 7,350.00** |

# జీవిత – వార్షిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/– (వెయ్యి రూపాయలు).
2. రెండు దఫాలుగా కూడా రూ.500/– చొప్పున చెల్లించవచ్చు.
3. జీవిత సభ్యత్వం చెల్లింపులపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించాలి. అయితే నేటి వరకు జీవిత సభ్యత్వంపై వచ్చిన వడ్డీని కూడా అసలు మొత్తానికే జమచేయడమైనది. ఒక్క పైసా కూడా పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించలేదు. 4) జీవిత సభ్యత్వం చెల్లించిన సభ్యులు తాము ఎప్పుడు పత్రిక వద్దని కోరితే, తక్షణం, వారు చెల్లించిన జీవిత సభ్యత్వం మొత్తం, వడ్డీ లేకుండా అసలు వాపసు ఇవ్వడమవుతుంది. 4) వార్షిక సభ్యత్వం రూ.100/– 5) మీ అడ్రస్సులో పోస్టల్ పిన్‌కోడ్ తప్పని సరిగా వ్రాయవలసింది. 6) బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు. మాకు అందిన జీవిత సభ్యుల వివరాలు ప్రతి నెలా పత్రికలో ప్రచురిస్తున్నామని గమనించగలరు

మా అడ్రస్: **ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ, సికింద్రాబాద్–500 087, ఫోన్: 99595–53218.**